ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

శుక్రవారం 12 జూలై 2024



టిడ్కో ఇంజనీర్లతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

సదరంలో.. సర్టిఫికేట్లు



శారీరక లోపం.. మనిషికి శాపం. వైక్యలం ఉండే వారి జీవనం కనాకష్టం. వారు పని చేసుకోవాలనుకున్నా శరీరం సహకరించదు. అలాంటి వారికి సాయంగా ప్రభుత్వం పింఛన్ ఇస్తుంది. అయితే ఈ పింఛన్లకు కక్కుర్తి పడిన కొందరు సదరం సర్టిఫికెట్లు పొందుతున్నారు. వైకల్యం లేకపోయినా ఏదో ఒక లోపం ఉన్నట్లుగా సదరం నుంచి ధ్రువీకరణ చేయించుకుని దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటివి పెద్దఎత్తున చోటుచేసుకున్నట్లు తాజాగా వెలుగుచూస్తున్నాయి. ఎటువంటి వైకల్యం లేకపోయినా వైసీపీకి చెందిన వారు పెద్దసంఖ్యలో పింఛన్లు పొందినట్లు వెలుగుచూస్తోంది. సదరం సర్టిఫికెట్లు జారీలో వైసీపీ నేతల ఆధ్వర్యంలో పెద్ద మాఫియా నడిచినట్లు అర్థమవుతోంది. ఇదే అవకాశంగా సదరం సర్టిఫికెట్లును నగదుకు కూడా కొందరు అమ్ముకున్నట్లు తెలుస్తోంది. దీంతో అసలైన లబ్ధిదారులు దివ్యాంగ పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వంలో ఇటీవల పింఛన్ల పంపిణీ సమయంలో దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్న వారిని చూసి ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఆశ్చర్యపోయారంటే సదరం ఏ స్థాయిలో దుర్వినియోగం చేశారో తెలుసుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో నకిలీ సదరం సర్టిఫికేటుగాళ్ల పని పట్టాలని పలువురు కోరుతున్నారు.

- వైకల్యం లేకపోయినా సర్టిఫికెట్
- దర్జాగా పింఛను అందుకుంటున్న అనర్హులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో భారీగా ధ్రువీకరణలు
- కూటమి ప్రభుత్వం రాకతో వెలుగులోకి నకిలీ లబ్ధిదారులు



గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో దివ్యాంగ పింఛన్ల పరిస్థితి. అనర్హులు ఏళ్ల తరబడి దర్జాగా పింఛన్లు కాజేస్తుంటే, అర్హులు పింఛన్లు దొరక్క నానా అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్న వారు వేలల్లో ఉంటే బాధితులు ఎందరో తమకు పింఛన్లు అందడంలేదని తిరగడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఐదేళ్లగా అటు పాలకులు, ఇటు అధికారులు వారిని కరుణించలేదు. ఎలాంటి వైకల్యం లేకపోయినా సదరం సర్టిఫికెట్లు తీసుకుని వేలాది మంది దివ్యాంగుల పింఛన్లు కైంకర్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏ పనీ చేసుకోలేని దీన స్థితిలో ఉండే దివ్యాంగులు మాత్రం తమకు పింఛను అందజేసి పుణ్యం కట్టుకోవాలంటూ కనిపించిన ప్రతీ అధికారికీ మొక్కుకుంటున్నారు.

వైసీపీ నేతలకే సదరం

వైసీపీ ప్రభుత్వ హయాంలో సదరం సర్టిఫికెట్లు అనేకం దుర్వినియోగం అయ్యాయి. వైకల్యం కారణంగా పనిచేసుకోలేనివారికి ప్రభుత్వం తరపున చేయూతను అందించడానికి ప్రభుత్వం దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తుంటుంది. ప్రభుత్వ వైద్యులు పరీక్షించి దివ్యాంగులకు సర్టిఫికెట్లు జారీ చేస్తుంటారు. సాధారణంగా 40 శాతానికి మించి వైకల్యం ఉంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతుంటారు. కాగా ఈ ప్రక్రియను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ శాఖలన్నీ అప్పటి అధికారపార్టీ సేవకే పరిమితమయ్యాయి. అందులో భాగంగా సదరం సర్టిఫికెట్లలో ఎక్కువభాగం వారికే దక్కాయి. వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులకు కుడి భుజాలుగా ఉన్న గ్రామ స్థాయి నాయకులు, వారి కుటుంబసభ్యులు సదరం సర్టిఫికెట్లతో లబ్ధి పొందారు. చాలా చోట్ల వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు కౌన్సిలర్లు, మెంబర్లు, వారి బంధువులు, మిత్రులు, వారి అనుచరులు భారీ సంఖ్యలో సదరం సర్టిఫికెట్లు కాజేసినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్లో స్లాట్లు బుక్ చేసుకోవడం, సదరం సర్టిఫికెట్ మాఫియాకి రూ.10 వేలు ఇస్తే వారి పని పూర్తవుతుంది. ఆ తరువాత తతంగమంతా ఆ మాఫియా చూసుకుంటుంది. పరీక్షించే వైద్యులను, ఇతర సిబ్బందిని వారే మెయింటెయిన్ చేసి సదరు వైసీపీ అనుయాయులకు సర్టిఫికెట్లు అందిస్తారు. ఆ వెంటనే తమ పార్టీ పెద్దల సిఫారసుతో వారంతా దరఖాస్తు చేసుకుని పింఛన్లు పొందుతున్నారు.

19 వేలు నకిలీ పింఛనుదారులు?

తాజాగా వెలుగు చూస్తున్న అంశాలను బట్టి ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లాలో భాగమైన చీరాలతో కలిపి మూడు జిల్లాల్లో దాదాపు 19వేల వరకూ నకిలీ దివ్యాంగ పింఛన్లు ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. తాజా పింఛన్ల పంపిణీ సందర్భంగా ఒక్కో ఊరిలో 10 నుంచి 15 దివ్యాంగ పింఛన్లు ఉంటే వాటిలో సగం అనర్హులవేనని సచివాలయ సిబ్బంది గుర్తించారు. విభజిత గుంటూరు జిల్లాలో 25,488 దివ్యాంగ పింఛనుదారులున్నారు. వారికి ఈ నెల 15.29 కోట్లు ప్రభుత్వం అందజేసింది. కానీ 6 వేల మంది పింఛనుదారులు అనర్హులని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 35,895 మంది దివ్యాంగ పింఛనుదారులు ఉండగా వారికి ఈ నెల 21.537 కోట్లు ప్రభుత్వం పింఛను కింద ఇచ్చింది. వీరిలో మరో 8వేల మంది వరకూ అనర్హులు ఉండవచ్చని ప్రాథమిక అంచనా. కాగా బాపట్ల జిల్లాలో 20 వేల మంది పింఛనుదారులు ఉన్నారు. వారిలో 5 వేల మంది వరకూ అనర్హులు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని పరిశీలించి, అనర్హులను తొలగించి, అర్హులకు పింఛన్లు జారీ చేయాలి.

- పిడుగురాళ్ల మండలం వైరాపురానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థోపెడిక్ వైకల్యం 84 శాతం ఉన్నట్లు సర్టిఫికెట్ తీసుకుని మూడేళ్లగా దివ్యాంగ పింఛను తీసుకుంటున్నాడు. అయితే అతడికి ఎటువంటి వైకల్యం లేదు. అతడు వైసీపీ నేత కావడంతో సదరం సర్టిఫికెట్ తీసుకుని ప్రభుత్వం నుంచి పింఛను అందుకుంటున్నాడు. చెన్నాయపాలెంలో మరో ఇద్దరు ఇలాగే దివ్యాంగుల పేరిట పింఛను కాజేస్తున్నారు.

- ప్రతి రోజూ ఎమ్మెల్యేల వద్దకు పదుల సంఖ్యలో పింఛను దరఖాస్తులు వస్తున్నాయి. వాటిలో మూడో వంతు దివ్యాంగుల పింఛన్లకు సంబంధించినవే. తీవ్ర వైకల్యంతో బాధ పడుతున్నవారే అత్యధికంగా ఉన్నారు. కానీ ఈరోజు వరకూ వారికి సదరం సర్టిఫికెట్లు దొరకలేదు. పింఛను వరం వరించలేదు.

- గుంటూరు జిల్లాలో ఓ ఎమ్మెల్యే దివ్యాంగ మహిళకు రూ.6వేలు పింఛను అందజేశారు. అయితే ఆమెను చూసిన ఎమ్మెల్యే, ఇతర నాయకులు, జిల్లా అధికారులు ఆశ్చర్యపోయారు. ఆమెకు ఎలాంటి వైకల్యం లేదు. కన్ను, కాలు అన్నీ బాగానే ఉన్నాయి. ఆర్థికంగా అత్యంత స్థితిమంతురాలు. అయినా ఆమె గత కొన్నేళ్లగా దివ్యాంగుల కోటా పింఛను తీసుకుంటోంది. ఈ పరిణామం చూసి విస్తుపోవడం ఎమ్మెల్యే వంతైంది.





టిడ్కో ఇళ్లను పూర్తి చేయాలి

- లబ్ధిదారులకు వెంటనే స్వాధీనపరచాలి
- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వెంగళాయపాలెంలో రెండో దశ కింద నిర్మించాల్సిన 1392 టిడ్కో గృహాలు, తెనాలి పూలే కాలనీలో నిర్మించాల్సిన 1008 టిడ్కో ఇళ్లను యుద్ధప్రాతిపాదికన పూర్తి చేసి లబ్ధిదారులకు స్వాధీన పరిచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. జిల్లాలో టిడ్కో ద్వారా నిర్మిస్తున్న గృహ సముదాయాల ప్రస్తుత స్థితిపై గురువారం కలెక్టరేట్‌లో టిడ్కో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టిడ్కో పర్యవేక్షక ఇంజనీర్ ఎం.సిహెచ్. కోటేశ్వరరావు మాట్లాడుతూ వెంగళాయపాలెం ఫేజ్-1లో నిర్మించిన 1088 గృహాలను లబ్ధిదారులకు స్వాధీనపరిచామన్నారు. ఫేజ్-2 లోని 1392 గృహాలు పురోగతిలో ఉన్నాయన్నారు. తెనాలిలో ఫేజ్ -1లో నిర్మించిన 848 గృహాలను లబ్ధిదారులకు స్వాధీనపరిచామని, ఫేజ్-2లో 1008 గృహాల పనులు వివిధ కారణాలతో ఆగిపోయాయన్నారు. అడవితక్కెళ్లపాడులో 4192, మంగళగిరిలో 1728, తెనాలిలో 848, పొన్నూరులో 2368 గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు స్వాధీనపరిచామన్నారు. సీఆర్డీఏ పరిధిలోని నవులూరు, నిడమర్రు, పెనుమాక, అనంతవరం, దొండపాడు, తుళ్ళూరు, ఐనవోలు, మందడంలలో నిర్మించిన 5024 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించామన్నారు. ఈ సమావేశంలో టిడ్కో ఈఈ ప్రసాదరావు, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా దినోత్సవ పోస్టర్లు విడుదల

గుంటూరు(మెడికల్): ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వరల్డ్ పాపులేషన్ డే పోస్టర్లను కలెక్టర్ నాగలక్ష్మి ఆవిష్కరించారు. అనంతరం వివిధ కేటగిరిల్లో బహుమతుల కోసం లక్కీడీప్ ద్వారా కలెక్టర్ ఎంపిక చేశారు. పీపీ ఐయూసీడీ కేటగిరిలో ఎం సంధ్యారాణి, వ్యాసెక్టమీ కేటగిరిలో రంజిత్‌కుమార్ ఎంపికయ్యారు. ఉత్తమ వ్యాసెక్టమీ సర్జన్‌గా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి చెందిన డాక్టర్ పీ రామారావు ఎంపికయ్యారు. ఉత్తమ పీపీ ఐయూసీడీ సర్జన్‌గా తెనాలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి చెందిన డాక్టర్ మానస ఎంపికయ్యారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి, పీడీఎంవో డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్, ఎస్‌ఏ పద్మజ, డెమో ఏ జయప్రసాద్, ఉమా జ్యోస్పిన్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై కందిపప్పు, బియ్యం

- రైతుబజార్లలో విక్రయాలు ప్రారంభించిన ఎమ్మెల్యేలు

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు, బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్లలో రాయితీపై కందిపప్పు, బియ్యం ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా రైతుబజార్లు, పౌరసరఫరాల శాఖ ఎంపిక చేసిన ప్రదేశాల్లో వీటి విక్రయాలను స్థానిక ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైల్ మార్కెట్‌లో కందిపప్పు కేజీ రూ.181 వరకు ఉందని, రైతుబజార్లల్లో దేశవాళి రకం రూ.160కే సార్టెక్స్ చేసి ప్యాకెట్లలో నింపి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. అలానే నాణ్యమైన స్టీమ్ బియ్యం(బీపీటీ వెరైటీ) కేజీ రూ.49, ముడి బియ్యం కేజీ రూ. 48కే అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రైతుబజార్లతో పాటు పప్పుల హోల్‌సేల్ కేంద్రాల్లోనూ ఇవి అందుబాటులో ఉంటాయన్నారు. తొలి రోజున గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించిందని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో కోల్డ్ చైన్ మార్కెట్లలోనూ ఇవి అందుబాటులోకి వస్తాయన్నారు.

ఇసుక.. చౌకగా

- నిర్మాణదారుడికి భారీ ఊరట
- నామమాత్రంగా సీనరేజ్, రవాణా చార్జీలు
- నాడు లారీ ఇసుక రూ.50 వేలు.. నేడు రూ.10 వేలు
- గతంలో నిలిపిన భవన నిర్మాణాలకు తాజాగా శ్రీకారం

● ఓ సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలనుకున్నాడు. అందుకోసం దాదాపు 5 లారీల ఇసుక అవసరం అవుతుందని తెలిసింది. ఒక్కో లారీకి రూ.40 వేల నుంచి రూ.50 వేలు చెల్లించాల్సి ఉందని, ఆ ప్రకారం కేవలం ఇసుక కోసమే రూ.2.50 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని అంచనా వేసుకున్నాడు. డబ్బంతా ఇసుకకే ఖర్చవుతుందని, ఇటుక, ఇనుము, కలప, కూలీలకు డబ్బు లేకుండా పోతుందని భావించాడు. దీంతో అతడి సొంతింటి కల అర్ధాంతరంగా ఆగిపోయింది.

- ఇది నాటి వైసీపీ పాలనలో పరిస్థితి

● అదే సామాన్యుడు ఇప్పుడు తన ఇంటి నిర్మాణానికి కావాల్సిన 5 లారీల ఇసుకకు రూ.50 వేలు మాత్రమే ఖర్చు చేయనున్నాడు. గతంలో ఒక లారీకి పెట్టే ఖర్చుతో ఇప్పుడు ఐదు లారీల ఇసుక వస్తుందని అతడు అంచనా వేసుకున్నాడు. ఒక్క ఇసుకలోనే రూ.2 లక్షల ఖర్చు తగ్గనున్నదని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

- ఇది ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పరిస్థితి

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనకు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు ఇసుక విషయంలో మార్పు రావడంతో సామాన్యుడి సొంతింటి కల ఇంకెంతో దూరంలో లేదని స్పష్టమవుతుంది. వైసీపీ హయాంలో రూ.50 వేలు ఇచ్చినా దొరకని ఇసుక ఈ రోజు పదివేలకే వస్తుంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అంతకముందు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత విధానాన్ని రద్దు చేసింది. కొత్త పాలసీ తీసుకు వస్తామని నాటి సీఎం జగన్ దాదాపు 8 నెలలు ఇసుక అందకుండా చేశారు. ఆ తర్వాత ఇసుక పాలసీ తెచ్చినా సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పైగా వారిని ఇసుక పేరుతో వైసీపీ నాయకులు నిలువు దోపిడీ చేశారు. లారీ ఇసుక రూ.25 నుంచి 40వేల వరకూ వెళ్లింది. బ్లాక్ మార్కెట్, ఇసుక మాఫియా పుణ్యమా అని రూ.50 వేలు కూడా చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ట్రాక్టరు ఇసుక కనీసంగా రూ.5 వేలు, గరిష్ఠంగా 10 వేల వరకూ వెళ్లింది. దీంతో నిర్మాణరంగం కుదేలైంది. కూలీలు పనులు లేక అల్లాడిపోయారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో లారీ ఇసుక రవాణా చార్జీలతో కలిపి రూ.9 నుంచి 10 వేలకే తన గుమ్మంలోకి వస్తోందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.2 వేలకే వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టన్ను ఇసుకకు రూ.2000 నుంచి 2500 వరకూ ఖర్చు చేయాల్సిరాగా, ఇప్పుడు అది కేవలం రూ.265కే వస్తోంది. టన్ను ఇసుకకు సీనరేజి కింద రూ.88 చెల్లించాలి. ఇసుక తవ్వినందుకు కాంట్రాక్టు సంస్థలకు టన్నుకు రూ.30 చెల్లించాలి. నిర్వహణ వ్యయం కింద రూ.20 చెల్లించాలి. రీచ్ నుంచి స్టాక్ పాయింట్లకు ఇసుక తరలింపునకు కిలో మీటరుకు రూ.4.90 రవాణా చార్జీగా నిర్ణయించారు. అదే ఇసుకను వినియోగదారుడు రీచ్ నుంచి తెచ్చుకుంటే రూ.4.90 చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆ మొత్తానికి వినియోగదారు 18 శాతం జీఎస్టీ చెల్లించాలి.

పనులకు శ్రీకారం.. కూలీలకు ఉపాధి

వైసీపీ హయాంలో ఇసుక కారణంగా నిర్మాణదారుల కష్టాలు, ఉపాధి కోల్పోయి కూలీలు పడిన ఆర్థిక బాధలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని అమలు చేశారు. తొలి రెండు మూడు రోజుల్లోనే లక్షలాది మెట్రిక్ టన్నుల ఇసుక జన సామాన్యానికి అందుబాటులోకి వచ్చింది. సామాన్యులు ఇప్పటి వరకు ఆపేసుకున్న నిర్మాణాలకు తిరిగి శ్రీకారం చుట్టారు. కూలీలు, మేస్త్రీలు పనుల్లో బిజీగా మారారు. గత ప్రభుత్వ హయాంలో టన్ను ఇసుక రూ.2 వేల నుంచి రెండున్నర వేలు ఉండగా అది ఇప్పుడు 265 రూపాయలకే సామాన్యుల గడప వద్దకు వచ్చి పడుతోంది.

ఓర్వలేక విష ప్రచారం..

ప్రస్తుత ఇసుక పాలసీకి వస్తున్న అనూహ్య స్పందనను చూసి ఓర్వలేని వైసీపీ విష ప్రచారానికి తెరతీసింది. తప్పుడు కథనాలు, వ్యాఖ్యానాలతో సామాజిక మాధ్యమాల ద్వారా విషం చిమ్ముతోంది. స్థానిక సంస్థలకు చెల్లించే సీనరేజిని, ఇసుక రవాణా నిమిత్తం అయ్యే ఖర్చులను ఆసరా చేసుకుని దారుణమైన తప్పుడు ప్రచారానికి వైసీపీ తెగబడుతోంది. వైసీపీ విష ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడంలేదు. వైసీపీ హయాంలో రూ.50 వేలకు లారీ ఇసుక కొన్నవాళ్లు, భారం మోయలేక పనులు ఆపేసుకున్నవాళ్లు అధికంగా ఉండడంతో వైసీపీ దుష్ప్రచారాన్ని వారే తిప్పికొడుతున్నారు.



రూ.3,500 కోట్లకు లెక్కలు తేలాలి

- వైసీపీ హయాంలో సీఎంఎఫ్ఎస్ దుర్వినియోగం
- పిడుగురాళ్లలో మంత్రి నారాయణ.. డయేరియా బాధితులకు పరామర్శ

పిడుగురాళ్ల, జూలై 11: ఐదేళ్ల వైసీపీ హయాంలో రూ.3,500 కోట్లకు లెక్కలు తేల్చాల్సి ఉందని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గురువారం తొలుత లెనిన్‌నగర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించి రోజువారి ఎన్ని కేసులు నమోదవుతున్నాయని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డయేరియా ప్రభావిత లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రాంతాల్లో గురువారం మంత్రి పర్యటించారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ప్రజలు కట్టే వివిధ రకాల పన్నులు సీఎంఎఫ్ఎస్ ద్వారా ప్రభుత్వానికి చేరగా అభివృద్ధి పనులకు కేటాయించామన్నారు. అయితే వైసీపీ హయాంలో ప్రజలు చెల్లించిన పన్నులు సీఎంఎఫ్ఎస్‌కు వెళ్లడమే తప్ప తిరిగి వచ్చింది లేదన్నారు. సీఎంఎఫ్ఎస్ విధానం పెట్టింది చంద్రబాబే అయినా నిధుల దుర్వినియోగం అంతా వైసీపీ హయాంలో జరిగిందని ఆరోపించారు. పట్టణాల అభివృద్ధికి రూ.3,500 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చెబుతున్నారే గాని వాటికి సంబంధించి బిల్లులు చూపకపోవడంతో కేంద్రం మ్యాచింగ్ గ్రాంట్ జత చేయడం లేదన్నారు. వైసీపీ హయాంలో ఖర్చు చేసిన వాటికి బిల్లులు ఇస్తే రూ.1150 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.



వైద్యశాలలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ

హరే కృష్ణ.. హరే రామ్

- మంగళగిరిలో వైభవంగా జగన్నాథ రథయాత్ర
- రథయాత్రను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, జూలై 11: ఇస్కాన్ ఆధ్వర్యంలో మంగళగిరిలో శ్రీ జగన్నాథుని రథయాత్ర గురువారం అత్యంత వైభవంగా సాగింది. జై జగన్నాథ్, హరేకృష్ణ, హరేరామ్ నినాదాలతో మంగళగిరి పురవీధులు మార్మోగాయి. తొలుత జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలకు హారతులిచ్చిన మంత్రి లోకేశ్... అనంతరం రథాన్ని లాగి రథయాత్రను ప్రారంభించారు. రథానికి ముందు సంప్రదాయబద్ధంగా బంగారు చీపురుతో రహదారి మార్గాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ప్రజా సేవ అంటే పరమాత్ముడి సేవ అన్నారు. ఇప్పుడు అందరి దృష్టి మంగళగిరి వైపే ఉందని, ఆ దేవుడి ఆశీస్సులతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు. మంగళగిరి నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మంగళగిరి బస్టాండు నుంచి బైపాస్ రోడ్డులోని ఆత్మకూరు బాపూజీ విద్యాలయం వరకు రథయాత్ర సాగింది. దారిపొడవునా జగన్నాథ రథం ముందు భక్తులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు ఒడిశాలోని పిప్లి నుంచి తెప్పించిన రంగుల పందిరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోలాట ప్రదర్శనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, బాపూజీ అకాడమీ చైర్మన్ యర్రాకుల తులసీరామ్, పిరమిడ్ ధ్యాన మండలి అధ్యక్షుడు ఆకురాతి శంకరరావు, బలరామ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లెబాట రాజా, సువర్ణ శ్రీనివాస దాస్, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలకు హారతి ఇస్తున్న మంత్రి నారా లోకేశ్



మంగళగిరి ఇస్కాన్‌కు వచ్చిన ఇండియన్ వరల్డ్ రికార్డును మంత్రి లోకేశ్‌కు చూపుతున్న ఇస్కాన్ ప్రతినిధులు

ఏఎన్‌యూ డిగ్రీ 4వ సెమిస్టర్
పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, జూలై 11 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఏప్రిల్ లో నిర్వహించిన డిగ్రీ నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఫలితాలను గురువారం తాత్కాలిక రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదనపు పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్ మాట్లాడుతూ బీకాం, బీఎస్సీ, బీఏ, బీసీఏ, బీబీఏ, బీఏవోఎల్ కోర్సుల ఫలితాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రీ వాల్యూయేషన్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1240 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పరీక్షలకు 14,544 మంది హాజరు కాగా 8439 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు రెడ్డి ప్రకాష్ వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బీ.సత్యనారాయణ, డాక్టర్ సుధాకర్, డాక్టర్ భబిత తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట పురపాలక సంఘం

Roc.No. 370/Works/2022/E1 Date: 11.07.2024

E-Procurement Notice

I 1. Number of Works: 5 (New)
2. Estimate Contract Value : 85,26,368/-
3. Name of Work: - Repair and renovation of Anna canteens at various places, development of Compost yard and Rapid filling arrangements for filling of SS tanks with canal water under 15th FC, General funds and special grant.
4. Bid Document Download Start Date : 12.07.2024 11.00 AM
5. Bid Document Download End Date : 15.07.2024 4.00 PM
6. Bid Submission closing date : 15.07.2024 4.30 PM

II 1. Number of Works: 17 (New)
2. Estimate Contract Value: 69,48,071/-
3. Name of Work: - Supply of man mazdoor for dividers and parks. Pushcarts, hydraulic tipper, hired water tankers 4000ltr capacity. Supply of chlorine gas cylinders and Removal of wet silt at various places in chilakaluripet Municipality.
4. Bid Document Download Start Date : 12.07.2024 11.00 AM
5. Bid Document Download End Date : 19.07.2024 4.00PM
6. Bid Submission closing date : 19.07.2024 04.30PM
7. Name and address of the office : Sri.Ch.Govinda Rao, Commissioner, Chilakaluripet Municipality Phone: 08647-253994, 9849006585.

For other details visit https://tender.apeprocurement.gov.in

స్వచ్ఛ భారత్.... స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ .... స్వచ్ఛ చిలకలూరిపేట

Sd/- Commissioner,
Chilakaluripet Municipality

లోకేశ్ ప్రజా దర్బార్‌కు అనూహ్య స్పందన



దివ్యాంగుడి నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న నారా లోకేశ్

- 16వ రోజు భారీగా తరలివచ్చిన ప్రజలు
- బాధితులకు భరోసా ఇస్తున్న మంత్రి లోకేశ్
- సమస్యలను మెయిల్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి

తాడేపల్లి, జూలై 11: సామాన్య ప్రజానీకం పడుతున్న కష్టాలు వారి సమస్యల పరిష్కారం కోసం మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. ఉండవల్లి నివాసంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు మంగళగిరి నియోజకవర్గం నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు తరలిరావడంతో ఉండవల్లి కరకట్ట అర్జీదారులతో నిండిపోయింది. లోకేశ్ ప్రతి ఒక్కరి కష్టాన్ని వింటూ వారికి భరోసానిస్తూ అర్జీలను సంబంధింత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపుతున్నారు.

వైసీపీ రేషన్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

- మంగళగిరి నియోజకవర్గంలో రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడుతున్న వైసీపీ నేతలు,సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పీ.నాగ సురేష్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. పలువురు అధికారులు ఎండీఏ ఆపరేటర్లను మేనేజ్ చేస్తూ రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడుతున్నారని విచారిస్తే విషయాలు వెలుగులోకి వస్తాయని కోరారు.
- సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని మంగళగిరికి చెందిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పలువురు లోకేశ్‌ను కోరారు.
- ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రేషన్ కార్డుతో పాటు పెన్షన్ ఆరోగ్యశ్రీ సదుపాయాలు కల్పించాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.
- రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా గ్రామీణాభివృద్ధి, సెర్ప్ సంస్థల్లో పని చేస్తున్న మండల వ్యవసాయ నిపుణులను కొనసాగించాలని ఆశాఖ సిబ్బంది కోరారు.
- ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం ప్రాథమిక పాఠశాలను కాపాడాలని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.
- రాష్ట్రంలో కూటమి అఖండ విజయం సాధించడంపై యర్రబాలెం గ్రామానికి చెందిన మహిళా రైతులు మాజీ జడ్పీటీసీ ఆకుల జయసత్య నేతృత్వంలో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకుని అనంతరం ఉండవల్లిలో నారా లోకేశ్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

సమస్యలను పర్సనల్ మెయిల్ ఐడీకి పంపండి : మంత్రి లోకేశ్

ప్రజల నుంచి వరదలా వచ్చిన మెసేజ్‌లతో సాంకేతిక సమస్య తలెత్తిన కారణంగా తన వాట్సాప్‌ను మెటా బ్లాక్ చేసిందని, దయచేసి సమస్యలు వాట్సాప్ చేయవద్దని మంత్రి లోకేశ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమస్య ఏదైనా సహాయం కావాలన్నా ఇక నుంచి తన పర్సనల్ మెయిల్ ఐడీ hello.lokesh@apgov.in కు పంపాలని విజ్ఞప్తి చేశారు. పేరు, ఊరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సమస్య సహాయానికి సంబంధించిన పూర్తి వివరాలు వినతులతో పొందుపరిచి మెయిల్ చేయాలని కోరారు. అనంతరం ఆయా సమస్యకు సహాయం చేయడం, పరిష్కారం చూపటం వంటి బాధ్యత తాను తీసుకుంటానని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.





అర్జీలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

వందేభారత్‌కు పిడుగురాళ్లలో స్టాపేజీ కల్పించాలి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి



దక్షిణ మధ్య రైల్వే జీఎంతో చర్చిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - తిరుపతి - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కి పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో నిలుపుదల సౌకర్యం కల్పించాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కి విజ్ఞప్తి చేశారు. అలాగే విజయవాడ నుంచి బెంగుళూరు వరకు నరసరావుపేట, వినుకొండలో స్టాప్‌లతో కొత్త వందేభారత్ రైలుని ప్రారంభించాలని కోరారు. గురువారం రైల్వే సమస్యలు పరిష్కారం కోరుతూ హైదరాబాదులోని రైల్ నిలయంలో పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రుణ్‌కుమార్ జైన్‌కు అందజేశారు. పల్నాడు ప్రజలకు మేలు కలిగేలా పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో పల్నాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపేజ్‌ని ఇవ్వాలని, సత్తెనపల్లి స్టేషన్‌లో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు నిలుపుదల కల్పించాలని, విశాఖపట్నం నుంచి గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేసారు. పేరేచర్ల నుంచి గన్నవరం/పెదవుటపల్లికి కొత్త ఎంఎంటీఎస్ రైలు సేవలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పల్నాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ విజయవంతంగా 25 సంవత్సరాల సేవలను పూర్తి చేసుకుందని, ప్రస్తుతం ఉన్న బోగీలను వందే భారత్ రైళ్ల ప్రమాణాలతో మార్చాలని కోరారు. కొత్త జిల్లా పల్నాడులో ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని, కొత్తవి మంజూరుచేయాలని కోరారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, మాచర్ల, నడికుడి రైల్వేస్టేషన్లను ప్రతిష్ఠాత్మకమైన అమృత్ భారత్ స్టేషన్ పథకం ఆధునికీకరణ చేపట్టాలని కోరారు.

రైతుబజారులో రాయితీపై కంది పప్పు, బియ్యం

- పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే పుల్లారావు, కలెక్టర్ అరుణ్‌బాబు
- రైతు బజారులలో అందుబాటులో నిత్యావసరాలు

చిలకలూరిపేట, జూలై 11 : చిలకలూరిపేట రైతు బజారులో రాయితీపై కంది పప్పు, బియ్యం విక్రయాలను స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు, పల్నాడుజిల్లా కలెక్టర్ అరుణ్ బాబుతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ.180 ధర పలుకుతున్న కంది పప్పును రైతు బజారులో రూ.160 లకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలను దశలవారీగా తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే కంది పప్పు, బియ్యం విక్రయ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ధరల నియంత్రణ కోసం మిల్లర్లు, వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించామన్నారు. తొలి దశలో కంది పప్పుపై కిలోకు రూ.21 తగ్గించినట్టు తెలిపారు. ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యం, కిలో కంది పప్పు



వినియోగదారుడికి కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కలెక్టర్

ఇస్తారని తెలిపారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ప్రారంభించిన ఈ విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే మాల్స్‌లతో పాటు ఇతర దుకాణాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే నిత్యావసరాల విక్రయాలు జరపాలని కలెక్టర్ కోరారు.

మనస్థాపంతో మహిళ ఆత్మహత్య

- అప్పు చెల్లింపులో బాధ్యత తీసుకోని భర్త
- పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ
- న్యాయం చేయలేదని పురుగు మందు తాగిన వైనం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు



శోభారాణి (ఫైల్)

బాపట్లరూరల్, జూలై 11: పోలీసులు తనకు న్యాయం చేయలేదంటూ ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెదుళ్ళపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి కొత్తపాలెం పంచాయతీ వడ్డెరపాలెం గ్రామానికి చెందిన బత్తుల శోభారాణి (30) అనే మహిళ కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన బత్తుల వెంకట్రావు అనే వ్యక్తితో 5 సంవత్సరాలు క్రితం వివాహమైంది. అయితే భార్యభర్తల మధ్య గొడవలు రావటంతో రెండేళ్ళ క్రితం శోభారాణి తన పుట్టింటికి వచ్చేసింది. అయితే వీరిద్దరు కలిసివున్న సమయంలో రూ.3 లక్షలు అప్పు తీసుకున్నారని, ఇప్పుడు ఆ అప్పుకు నాకు సంబంధం లేదని భర్త వెంకట్రావు అడ్డం తిరిగాడు. అయితే అప్పులు వాళ్ళు అతనిని పట్టుకొని అతని ఆటోను వెదుళ్ళపల్లి పోలీసులకు అప్పగించారు. భార్య శోభారాణియే తనను, ఆటోను పోలీసులకు పట్టించిందన్న కోపంతో భార్యపై అతడు కేసు పెట్టాడు. దీంతో శోభారాణి గ్రామంలోని పెద్ద మనుషులను తీసుకొని పోలీసుస్టేషన్‌కు వెళ్లి మాట్లాడగా.. 'నీకు తప్పకుండా న్యాయం చేస్తాం' అని పోలీసులు తెలిపారు. అయితే పోలీసులు తన భర్తను, ఆటోను వదిలేయటంతో ఇదేంటని ఆమె పోలీసులను అడగగా సమాధానం లేకపోవడంతో మనస్థాపానికి గురై పురుగు మందు తాగింది. స్థానికులు వెంటనే బాపట్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా చికిత్సపొందుతూ ఆమె మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు శోభారాణికి పోలీసులు అన్యాయం చేశారంటూ రోడ్డుపై ధర్నా చేపట్టారు. బాపట్లరూరల్ సీఐలు హజరత్‌బాబు, శ్రీహరిలు కుటుంబ సభ్యులతో మాట్లాడి తప్పకుండా న్యాయంచేస్తామని హామీనివ్వటంతో ధర్నాను విరమించుకున్నారు. ఈ ఘటనపై రూరల్ సీఐ హజరత్‌బాబును వివరణ కోరగా బత్తుల శోభారాణి, వెంకట్రావులు కలిసి ఉన్నప్పుడు రూ.3లక్షలు అప్పుచేశారని, అనంతరం వారు విడిపోవటంతో భర్త వెంకట్రావు అప్పుకట్టనని చెప్పగా అతను నడిపే ఆటోను అతడి భార్య వడ్డెరపాలెం తీసుకు వచ్చిందని, అయితే ఆ ఆటో వెంకట్రావుది కాకపోవటంతో ఆటో ఓనర్ వెదుళ్ళపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వెదుళ్ళపల్లి పోలీసులు ఆటోను ఓనర్‌కు అందజేశారని, దీంతో ఆ మహిళ మనస్థాపానికి గురై పురుగు మందు తాగి మృతి చెందిందని సీఐ తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు పురుగు మందు తాగాడు..

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి



శ్రీనివాసరావు మృతదేహం

ప్రత్తిపాడు, జూలై 11: మద్యానికి పూర్తిగా బానిసైన భర్తను తాగుడుమానుకోమని భార్య హెచ్చరించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన భర్త పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడులో జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన పల్లపు శ్రీనివాసరావు (32) తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతనికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే పూర్తిగా మద్యానికి బానిసైన భర్తను 'పిల్లలు పెద్ద వాళ్లు అవుతున్నారు.. ఇక తాగుడు మానుకోవాలి' అంటూ భార్య మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన శ్రీనివాసరావు గడ్డి మందు తాగాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు శ్రీనివాసరావును దగ్గరలోని కాటూరి వైద్య కళాశాల ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అనంతరం చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరిన ఎమ్మెల్యే ప్రవీణ్



ఆర్థిక మంత్రి పయ్యావులకేశవ్‌తో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జూలై 11 : పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక మంత్రిని ఎమ్మెల్యే ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ పరిస్థితిని వివరించి, అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు భాష్యంప్రవీణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయం, రోడ్లు, తాగునీటి పథకాల అమలుకి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరినట్టు తెలిపారు. నియోజక వర్గంలో కాలువ చివరి భూములు అధికంగా ఉన్నాయని, సాధ్యమైనన్ని ఎత్తిపోతల పథకాల ద్వారా ఆయా సాగు భూములకు నీటిని అందించాల్సి ఉందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ అసమర్థపాలనలో విద్యుత్‌రంగం సంక్షోభంలో కూరుకు పోయిందని, సుమారు రూ.48వేల కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేసిన విద్యుత్ రంగ శ్వేతపత్రాన్ని పరిశీలిస్తే ప్రజలకు కళ్ళు చెదిరే నిజాలు తెలుస్తున్నాయని అన్నారు. గాడి తప్పిన వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషిచేస్తున్నారని, ఆయనకు ప్రజలందరూ సహకరించాల్సిన అవసరం ఉందని భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు.





కలెక్టర్ అరుణబాబు, ఎస్పీ మాలికగార్గ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొమ్మాలపాటి

పల్నాడును అగ్రగామిగా నిలబెట్టాలి

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్
- కలెక్టర్, ఎస్పీలను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు

నరసరావుపేట టౌన్, జూలై 11 : పల్నాడు అన్ని రంగాలలో అగ్రగామిగా నిలబెట్టాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీదర్ కోరారు. గురువారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పీ అరుణబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు. కాగా అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మలిక గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ పల్నాడులో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు అసాంఘీక శక్తులను ఉక్కుపాదంతో అణిచివేయాలని ఎస్పీకి సూచించారు. జిల్లాలో నెలకొన్న ప్రస్థుత పరిస్థితులపై కొమ్మాలపాటి వారితో చర్చించారు.



రోబోతో వీసీ నాగభూషణ్, విద్యార్థులు

రోబోటిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు

- రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లా

గుంటూరు(విద్య), జూలై 11:భవిష్యత్తులో రోబోటిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లా తెలిపారు. చేబ్రోలు మండలం పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ (రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్) విభాగంలో 'రోబోకప్లర్స్ సెమి అండ్ హ్యూమనాయిడ్ రోబోట్ మ్యానుఫాక్చరింగ్ హబ్'ను గురువారం ఘనంగా ప్రారం భించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రవీణ్ మల్లా మాట్లా డుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ అడ్వాన్స్డ్ రోబోటిక్స్ లేబొరేటరీతో మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈహబ్ వలన విద్యార్థులతో పాటు పరిశోధనా అధ్యాపకులు రోబోట్‌లను రూపొందించడం, వాటిని అభివృద్ధి చేయడం మాత్రమే కాకుండా వాటి వాణిజ్యీకరణ కోసం మార్కెట్‌లోకి తీసుకెళ్లే అద్భుతమైన అవకాశం వస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

27,246 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 26,349 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 27,246 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 16,946 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16500	334	11000	15000
నెంబరు. 5	9000	15000	నెంబరు. 5	–	–
273	9500	11000	273	–	–
341	9000	17500	341	10000	15500
4884	12800	12800	4884	12000	14500
సూపర్ 10	15500	15500	సూపర్ 10	13200	13200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18500	తేజ	10000	18000
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9500	14000
దేవనూరు డీలక్స్	9000	13500	దేవనూరు డీలక్స్	8800	15000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	10000



ఉద్యోగావకాశాలు

→ మంగళగిరి పరిసర ప్రాంతాలలో ప్రముఖ పురుగు మందు కంపెనీలో పని చేయుటకు యువకులు కావలెను. Q: డిగ్రీ, జీతం : 15000, TA+DA_3000, (టూ వీలర్ కావలెను). సంప్ర. 81850 46367. AJG-191612

→ ప్రభావతి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ & మెడికల్ షాపు నందు పనిచేయుటకు నర్సింగ్ స్టాఫ్ కావలెను. హాస్టల్ సదుపాయం మరియు ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర. 98492 30580, అడ్రస్ : 1/4, రామన్నపేట, కొరిటెపాడు, గుంటూరు RK-1252

→ Hindi Subject Teacher Wanted from 6th to 10th Classes Hindi Subject Teaching. Free Boarding and Lodging. Contact immediately, Sri Raghavendra High School, Kurichedu, Cell: 9490327336 AJO-190347

→ WANTED WORKERS AND SUPERVISERS (Super markets, Hotels, Restaurents, Factories, Construction Companys) ✆ 91210 57233. AJB-423

→ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యరులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000. సంప్ర. 9550745296. AJV-192984

వధువు కావలెను

→ కుల పట్టింపు లేదు / 35 సం. / ఏకైక కుమారుడు / MBA/ ప్రైవేట్ ఉద్యోగం / ఎత్తు 5.5 / తల్లిదండ్రులు లేరు. ఏ బాదరబందీలేని అందమైన అబ్బాయికి 1వ & 2వ వధువు కావలెను. Cont.:7899598848 AJH-001974

CHANGE OF NAME

I, Pasumarthi Bhaskar Rao (ESM No.13622282F), Born on 25/04/1974, R/o D.No.1-34/1, Mandevaripalem, Pittalavanipalem, Bapatla-522314, changed Name Vide AP Gazette No.250 Issue No.530 dt.04 Jul 2024, shall henceforth be known as PASUMARTHI BHASKARA RAO S/o PASUMARTHI PRASADA RAO AJH-14560

స్థలం అమ్మకము

ఇన్నర్ రింగ్ రోడ్

→ రెడ్డిపాలెం, శాంతి ఆర్ట్స్ ప్రక్క రోడ్డున ఆంజనేయులు కాలనీ, సిమెంట్ రోడ్డు నందు 252 చ॥గజాల దక్షిణము ఫేస్ ఖాళీ స్థలము అమ్మకమునకు కలదు. ఫోన్: 8297941638. AJG-184776

పోయినవి

→ I, VALE SRIKANTH S/o. VALE CHINA KOTESWARA RAO, R/o. Flat No.102, Machiraju Residency, LI C Colony 2nd Lane, Stambalagaruvu, Guntur, Andhra Pradesh. I have Obtained Passport with No: L4081488, Issued by Passport Officer, HYDERABAD, Issued on 01-08-2013, Expiry Date : 31-07-2023. The said passport was lost, while I was travelling at Pattabhipuram, Guntur for Xerox Copies. I tried to trace but in vain. AJG-191486

మీ సర్టిఫికెట్స్ పోయినవా ?

→ మీరు పోగొట్టుకున్నా / కాలిన / చిరిగిన 10, ఇంటర్, డిగ్రీ మొ॥ సర్టిఫికెట్స్ తెప్పించబడును. సర్టిఫికెట్స్ కరెక్షన్ & పేరు మార్పిడికి గైడెన్స్, స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్, గుంటూరు. సెల్ : 98491 85616. AJG-191534

EDUCATION

→ AP State Scholarship Eligible Students pay small admission fee and Join B.Sc Com Sciences - learn Python, B.Sc Electronics - Learn CMOS VLSI, B.Com Comp App - Learn Tally, BA Economics / History / Special English - Learn MS Office, PLNM (Prabhala) Degree College, Opp. Acharya Nagarjuna University Mens Hostel, Cont: 91774 08565. AJG-191481

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు 99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	99639 84109
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

గుంటూరు	నాజ్ థియేటర్
గుంటూరు	హరిహరమహల్
గుంటూరు	గౌరీ శంకర్
గుంటూరు	శివ థియేటర్
గుంటూరు	సినీ స్క్వేర్
గుంటూరు	సినీ ఫ్రైమ్
గుంటూరు	వి.ప్లాటినో
గుంటూరు	ఫోనిక్స్ మాల్ (మైత్రీ)
గుంటూరు	ది సినిమాస్
గుంటూరు	జెఎల్ఇ సినిమాస్
ఒంగోలు	గోరంట్ల సినిమాస్
ఒంగోలు	రవి ప్రియమాల్
ఒంగోలు	సత్యం థియేటర్
తెనాలి	సంగమేశ్వర
తెనాలి	పెమ్మసాని
నరసరావుపేట	లక్ష్మి నరసింహ
నరసరావుపేట	ఈశ్వరమహల్
చిలకలూరిపేట	సాయి కార్తీక
చీరాల	సురేష్‌మహల్
బాపట్ల	శ్రీనివాసమహల్
పిడుగురాళ్ళ	గంగామహల్
పొన్నూరు	శ్రీలక్ష్మి
మంగళగిరి	ఊర్వశి
మంగళగిరి	వెంకటేశ్వర
రేపల్లె	రాజ్యలక్ష్మి
మాచర్ల	వెంకటేశ్వర
సత్తెనపల్లి	సాయికృష్ణ
వినుకొండ	కీర్తి డీలక్స్
అద్దంకి	వి.ఎస్.ఎస్
టంగుటూరు	అప్సర
చీమకుర్తి	కె3కె సినిమాస్





నల్లచెరువులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ఎన్డీయే ప్రభుత్వంపై వైసీపీ నేతల విమర్శలు సిగ్గుచేటు

గుంటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజారంజక పాలన సాగిస్తున్న ఎన్డీఏ కూటమిపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం సిగ్గుచేటని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. గుంటూరు చుట్టు గుంట సెంటర్లోని రైతుబజార్లో సబ్సిడీ కందిపప్పు, బియ్యం పంపిణీ కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చౌకధరలకే పేదలకు నిత్యావసర వస్తువులు అందించడమే ధ్యేయంగా టీడీపీ పని చేస్తోందని, కందిపప్పు కిలో.. రూ.160 బియ్యం కిలో.. రూ.48లకు అందిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు పశ్చిమ తహసీల్దార్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల ఫోటోలు ఏర్పాటు చేయకపోవటం శోచనీయమని, అధికారులు ఇంకా వైసీపీ మత్తులోనే ఉన్నారని త్వరలోనే మత్తు వదిలి పని చేస్తారని ఆశిస్తునట్లు ఆమె అన్నారు. ఉచిత ఇసుక విషయంలో వైసీపీ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ప్రజల మీద మోపిన భారాలను చంద్రబాబు ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారని చెప్పారు.

● నల్లచెరువులో ప్రజాసమస్యల తిష్ఠ

19వ డివిజన్ నల్లచెరువులో సమస్యలు తిష్ఠ వేసాయని, కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, మంచినీరు, డ్రైనేజి సమస్యలను కూడా గత పాలకులు విస్మరించారని గళ్లా మాధవి విమర్శించారు. నల్లచెరువులో ఆమె పర్యటించి వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయమని, తాగునీటి కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గంజాయి కోరల్లో చిక్కుకున్న యువత స్థానిక ప్రజల పై దాడులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు అందడంతో గంజాయి ప్రభావం ఎక్కువగా ఉన్న నల్లచెరువు, ఆర్ అగ్రహారం, సంపత్‌నగర్, వడ్డెగూడెంలో ఆమె పర్యటించారు. పోలీసులు మఫ్టీలో తిరుగుతూ, పెట్రోలింగ్‌ను పెంచాలని పోలీసులకు ఎమ్మెల్యే మాధవి సూచించారు. కార్యక్రమంలో రాళ్లబండి రామరాజు, తెలుకుట్ల హనుమాయమ్మ, పానకాల లక్ష్మణ్, రహీం, చంద్రగిరిబాబు, యోగేశ్వరావు, పులి కృష్ణ, బత్తుల రమణ మ్మ, టెంట్ హౌస్‌బాబు, పరిమి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● ఇటీవల చేతికి శస్త్ర చికిత్స చేయించుకున్న సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణను గుంటూరులోని ఆయన గృహంలో గళ్లా మాధవి పరామర్శించారు.

నాగార్జునను తక్షణమే అరెస్టు చేయాలి : వంశీకృష్ణ

గుంటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును చంపేస్తామని బెదిరింపులకు దిగిన యనమల నాగార్జునను తక్షణమే అరెస్టు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నవ వంశీ డిమాండ్ చేశారు. చంద్రబాబును చంపేస్తామని బెదిరించిన యనమల నాగార్జునపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్పీ తుషార్ డూడికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలిపిరి బాంబ్ బ్లాస్ట్‌లో చంద్రబాబు తప్పించుకున్నారు, ఈసారి ఖచ్చితంగా చంపేస్తామని బహిరంగంగా సాక్షి ఛానల్ డిబేట్‌లో నాగార్జున అనుచిత వ్యాఖ్యలు చేశాడన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురించి మాట్లాడేటం త స్థాయి నాగార్జునకు లేదన్నారు. ఇష్టం వచ్చినట్లు పేమెంట్లు తీసు కొని ఆంబోతు లాగా కారు కూతలు కూస్తే ఖబర్దార్, తెలుగు విద్యార్థి, తెలుగు యువత నిన్ను వదిలి పెట్టె ప్రసక్తే లేదు అని హెచ్చరించా రు. సాక్షి ఛానల్ యాజమాన్యంపైన కూడా న్యాయపరంగా చర్యల తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జాస్తి శివరాం, కొత్రపాటి శ్రీనివాసరావు, నక్క హేమంత్, ఏలూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు



కర్నూలు త్రీటౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఐటీడీపీ నాయకులు

కర్నూలులో ఉన్మాది బోరుగడ్డపై కేసు

గుంటూరు, జూలై 11: అసభ్య పదజాలం, హెచ్చరికలు, బెదిరింపులకు పాల్పడుతున్న గుంటూరుకు చెందిన బోరుగడ్డ అనిల్‌కుమార్‌పై కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సమాజంలో అన్నివర్గాల ప్రజల్లో అత్యంత గౌరవ ప్రతిపత్తులున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని, గౌరవ న్యాయమూర్తులను దుర్భాషలాడుతూ, అసభ్య వీడియోలను పోస్టు చేస్తూ, ట్విట్టర్ వేదికగా సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్న గుంటూరు నగరానికి చెందిన ఉన్మాది బోరుగడ్డ అనిల్‌పై కఠినచర్యలు చేపట్టాలని కర్నూలు పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షుడు గట్టు తిలక్ ఫిర్యాదు చేశారు. తక్షణమే ఇటువంటి నిందితులపైన చట్టపరమైన కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు పోలీసులు బోరుగడ్డ అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాపు అభివృద్ధి పథకాలను పునరుద్ధరించాలి

● కాపు కార్పొరేషన్ ఎండీ కృష్ణమూర్తికి విజ్ఞాపన

గుంటూరు(తూర్పు), జూలై 11 : 2014-2019 సంవత్సరంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కాపు, తెలగ, ఉపకులాల అభ్యున్నతికి పథకాలను ప్రవేశపెట్టిందని, తిరిగి ఆ పథకాలను వెంటనే అమలు పరిచి కాపుల అభ్యున్నతికి తోడ్పాటునివ్వాలని కాపు కార్పొరేషన్ ఎండీ కృష్ణమూర్తికి తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సెక్రటరీ బాలిశెట్టి విజయ్ కుమార్ మాట్లాడుతూ గుంటూరులో కాపు భవనం నిర్మాణం త్వరలో మొదలు పెట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ప్రజా గళంలో, మ్యానిఫెస్టో‌లో ప్రతి సంవత్సరం రూ.3000 కోట్ల చొప్పున కాపు అభ్యున్నతి నిధులను విడుదల చేస్తామని ఇచ్చిన హామీలు నెరవేరుస్తారన్న పూర్తి నమ్మకం తమకు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోలా చలపతిరావు, రేపల్లె నవీన్, చెమిటికంటి కిరణ్, తుమ్మల నరసింహా రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల పాఠశాలను సందర్శించిన డీవైఈవో

గుంటూరు(విద్య), జూలై 11: స్థానిక చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వర రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన ఆహార పదార్థాలను పరిశీలించారు సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎండీ ఖాసీంకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు, ప్రతి విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు

బీఎల్‌వోలకు ఒక నెల జీతం పారితోషకంగా ఇవ్వాలి

గుంటూరు సిటీ, జూలై 11 : బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్‌ఓ)ఒక నెల జీతం పారితోషకంగా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో అబ్దుల్ రజాక్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మూడు సంవత్సరాలుగా బీఎల్‌వోలకు రావలసిన రూ.18వేల గౌరవ వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. సుమారు 70వేల మంది బూత్ లెవెల్ అధికారులకు రావాల్సిన గౌరవ వేతనం ఇప్పటివరకు అందించలేదని, ఈ మొత్తాన్ని త్వరగా విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పందిస్తూ బీఎల్‌వోల గౌరవ వేతనం విడుదలకి కృషి చేస్తామని తెలిపినట్లు అబ్దుల్ రజాక్ వెల్లడించారు.



అర్హులందరికి సంక్షేమ పథకాలు అందాలి

● కలెక్టర్ నాగలక్ష్మి



సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ సంక్షేమ శాఖల ద్వారా అమలు చేసే పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సదరు సంక్షేమ పథకాలు అందేటట్లు అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. గురువారం కలక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో వివిధ సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సాంఘీక సంక్షేమ, ఎస్సీ కార్పొరేషన్, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాల, విభిన్నప్రతిభావంతుల శాఖలపై అధికారులతో సంక్షేమ పథకాలపై సమీక్షించారు. సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన రావు మాట్లాడుతూ సాంఘీక సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు అందిస్తున్న మెనూ రేట్లు పెంచాల్సి ఉందని, వారంలో అందించే ఆహార పదార్థాల జాబితా ప్రదర్శిస్తారన్నారు. బిల్డింగ్ రిపేర్స్‌కు బడ్జెట్ కేటాయించలేదన్నారు. స్థానిక ఏసీ కాలేజీ ఎదురుగా 2013వ సంవత్సరంలో అంబేద్కర్ భవన్ మంజూరు అయిందని, నేటికీ భవన నిర్మాణం పూర్తి కాలేదని తెలిపారు. బీఆర్ స్టేడియం పక్కన ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిధుల్లేక ఆగిపోయిందని, దీని నిర్మాణానికి రూ.90 లక్షల అవసరం అని తెలిపారు. జిల్లాలో అత్యాచార, హత్య కేసులలో బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉందని, ఎనిమిది కేసుల్లో నాలుగింటికి సంబంధించి పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇవ్వడం జరిగిందని, రెండు కేసులలో 50 శాతం, మిగిలిన రెండు కేసులకు నష్టపరిహారం అందించాల్సి ఉందని కలెక్టర్‌కు వివరించారు.

కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని, డైట్ చార్జీలు, పోస్టుల ఖాళీల వివరాలు ఏమైనా ఉన్నా నోట్ ద్వారా తనకు తెలియజేయాలని సూచించారు. గురుకుల పాఠశాల జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ మాట్లాడుతూ తాడికొండ, అడవి తక్కెళ్ళపాడు, కాకుమానులలో గురుకుల పాఠశాలలు ఉన్నాయని, టీచర్స్ అందరూ ఉన్నారని, గురుకుల పాఠాశాలల్లో చదివిన విద్యార్థు లు పదో తరగతి పరీక్షలో 98 శాతం ఉత్తీర్ణత సాధించారని, 21 మంది ఐఐటి, ఎన్ఐటిలకు అర్హత సాధించారని తెలియజేశారు. గురుకుల పాఠశాలల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. అలాగే తాడికొండ పాఠశాల రోడ్డుకు దిగువున ఉందని, వర్షం వస్తే ఇబ్బందిక రంగా ఉందని తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ సంక్షేమ శాఖల్లో ఏమైనా సమస్యలు ఉంటే నోట్ ద్వారా తన దృష్టికి తీసుకురావాలని, జిల్లా అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు.

50 శాతం ఇసుక బిల్డర్లకు కేటాయించాలి

● కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అసోసియేషన్ నాయకులు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 11: గుంటూరు నగరానికి దగ్గరగా ఉన్న ఒక ఇసుక రీచ్ నుంచి 50 శాతం ఇసుకను బిల్డర్లకు కేటాయించాలని నరెడ్కో కాపిటల్ జోన్ తరపున కలెక్టర్ నాగలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టర్‌ను కలిసి అసోసియేషన్ తరపున వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు వివరించామన్నారు. ముఖ్యంగా బిల్డర్స్‌కి గుంటూరుకి దగ్గరలో ఉన్న ఇసుక రీచ్‌లో ఒక రీచ్ నుంచి 50 శాతం ఇసుక మన బిల్డర్స్‌కి కేటాయించడం ద్వారా మాకు దళారుల వ్యవస్థ లేకుండా ఉంటుందని తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నరేడ్కో అధ్యక్షుడు పెరవలి నాగవంశి, కార్యదర్శి శ్రీనాథ్, టీ అర్జున్ సాయి, వై దుర్గా ప్రసాద్, ఎస్ శ్రీనివాస్ కుమార్, ఎం శ్రీనివాస్ బాబు, పి.సుధాకర్, వి.రాంబాబు, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి సహకారం అందించండి

● కలెక్టర్ నాగలక్ష్మిని కోరిన మేయర్

గుంటూరు(కార్పొరేషన్), జూలై 11 : గుంటూరు నగరాభివృద్ధికి సహకారం అందించాలని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు నూతన కలెక్టర్‌గా నియమితులైన ఎస్.నాగలక్ష్మిని కోరారు. గురువా రం కలెక్టర్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించి, నగరాభివృద్ధిపై చర్చించారు. మేయర్ మాట్లాడుతూ కలెక్టర్‌గా వచ్చిన నాగలక్ష్మి, గతంలో కమిషనర్‌గా విధులు నిర్వహించినందున, గుంటూరు నగరంపై పూర్తి అవగాహన కలిగి ఉంటారని, కావున అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు.

పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేయాలి

గుంటూరు(విద్య), జూలై 11: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలో స్కౌట్ యూనిట్స్ స్థాపించాలి డీఈవో పి.శైలజ సూచించారు. గురువారం డీఈవో కార్యాలయంలో జరిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అకడమిక్ క్యాలెండర్ తయారు చేసి స్కౌట్ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ ఏం ఏడుకొండలు, స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యా యులు పి.శ్రీనివాసరావు ఎస్‌కే నజీర్, ఎం ఏడుకొండలు, కుమార్, అనిల్‌కుమార్, శీహరి, నరేష్, కామాక్షి, ప్రసన్నకుమారి, మల్లేశ్వరి, వర కమలకుమారి పాల్గొన్నారు

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల త్రో బాల్ పోటీలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జూలై 11: స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ పాఠశాల ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగే ఆంధ్రా, తెలంగాణ రాష్ట్ర స్థాయి సీబీఎస్‌సీ ఈ పాఠ శాలల త్రోబాల్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అండర్ 14, 17, 19 బాలికల విభాగంలో ఈ పోటీలకు దాదాపు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా గుంటూరు బిషప్ చిన్నాబత్తుని భాగ్యయ్య హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. మెగా టోర్నీ నిర్వహిస్తున్న స్టెమ్ పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ నరసింహారెడ్డి, లిటిల్ ఫ్లవర్, సెయింట్ జోసెఫ్ పాఠశాల (పెదకాకాని), ప్రిన్సిపాల్స్ సావేరి, సంధ్య, స్టెమ్ పాఠశాల ప్రిన్సిపాల్, పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ భరత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ అనుపమ, రమాదేవిలు క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న చిన్నాబత్తుని భాగ్యయ్య, చీఫ్ కోచ్ నరసింహారెడ్డి

ప్రభుత్వ వృత్తి విద్యాకళాశాలలో వక్తృత్వ పోటీలు

గుంటూరు(విద్య), జూలై 11 : స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ వృత్తి విద్యాకళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురష్కరించుకుని విద్యార్థినులకు వ్యక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఆనందబాబు తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను డాక్టర్ శనక్కాయల ఉదయశంకర్ ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడ్ని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), జూలై 11: కిడ్నీ బాధితుడు గార్లపాటి మధుబాబును మోసం చేసిన బాధ్యులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించా లని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. మధుబాబుకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ కుంభకోణాన్ని వెలికితీసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మస్తాన్‌వలీ, కే శ్రీనివాస్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కూలి పనులు దొరకడం లేదని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, జూలై 11: స్థానిక అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి లోని శారదాకాలనీ 14వ లైనుకు చెందిన వేల్పుల యేసు (34) అనే కూలి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలీ పనులు సరిగా దొరకడం లేద ని మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగిన యేసు ఈనెల 4న ఎలుకల మందు తిన్నాడు. ఆయనను వెంటనే జీజీహెచ్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స తీసుకోకుండానే వచ్చేసాడు. ఈ క్రమం లో ఈనెల 7న ఆయన పరిస్థితి విషమంగా మారడంతో వెంటనే కుటుంబసభ్యులు మరోసారి జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

స్థానిక నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్‌లో ప్యారడైజ్ టీ స్టాల్ వద్ద కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతడికి సుమారు 40-45 సంవత్సరాల వయసు ఉంటుందని, కొద్ది రోజుల నుంచి చుట్టుపక్కల అడుక్కుని తింటూ అక్కడ ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో 10న రాత్రి సుమారు 7 గంటల సమయంలో సదరు వ్యక్తిని మార్కెట్ వైపు నుంచి కలెక్టరేట్ వైపునకు వెళుతున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు తెలిసినచో గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

శ్రీచైతన్య ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా ర్యాలీ

గుంటూరు(విద్య), జూలై 11: స్థానిక లక్ష్మీపురంలోని శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రీన్ ఇండియా ర్యాలీ నిర్వహించారు. ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవుల సంక్షరక్షణ కోసం విద్యార్థులు కృషి చేయాలని, మొక్క ల్ని విస్తృతంగా నాటడంతోపాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకో వాలని సూచించారు. అడవుల రక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి లక్ష్యం గా గ్రీన్ ఇండియా ర్యాలీ నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమం లో ప్రిన్సిపాల్ ఎం వినీత, కోఆర్డినేటర్ మూర్తి, డీన్ హరిబాబు, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ నిధుల దారి మళ్లింపుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

● దళిత, బహుజన, ప్రజా సంఘాల డిమాండ్

గుంటూరు, జూలై 11: వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఎన్ని కోట్ల రూపాయలు దారి మళ్లించారో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్వేత పత్రం విడుదల చేయాలని దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అరండల్‌పేటలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్-జాషువా-పూలే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ దళిత, గిరిజనుల సామూహిక అభివృద్ధికి కేటాయించాల్సిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను భారీ ఎత్తున దారి మళ్లించారని విమర్శించారు. సీఎం చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల దారి మళ్లింపుపై శ్వేతపత్రం విడుదల చేసి జగన్ దళిత గిరిజనులను ఏ విధంగా మోసం చేశాడో వివరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, సోషల్ యాక్టివిస్ట్ కనకవల్లి వినయ్ బాబు, బీసీ బహుజన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గం సాంబ శివరావు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అతవాలె) రాష్ట్ర కార్యదర్శి విప్పర్ల ముత్తయ్యలు పాల్గొన్నారు.

ఇసుక ఉచితం ప్రకటనతో ముస్లింలకు మేలు : అబ్దుల్ గని

గుంటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానం వల్ల ముస్లిం మైనార్టీలకు ఎంతో మేలు చేకూరుతుందని టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ గని అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల తో మాట్లాడారు. గత ప్రభుత్వంలో పని లేక రాష్ట్రం వదిలిపెట్టి వెళ్లిన ఎంతోమంది ముస్లింలు స్వస్థలాలకు చేరుకుంటున్నారన్నారు. భవన నిర్మాణ పనిచేసే ముస్లింలకు జీవనోపాధి లభించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మైనార్టీల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

యంగ్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తా

గుంటూరు, జూలై 11: అమరావతి సబ్ రీజియన్ ఆఫ్ యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని సంస్థ ఛైర్మన్ మోపర్తి సునీల్‌కుమార్ తెలిపారు. అసోసియేషన్ అడ్ హాక్ కమిటీ సమావేశం గురువారం స్టాల్ గర్ల్స్ స్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పలు నిర్ణయాలను కమిటీ ఆమోదిం చింది. ముఖ్యంగా అసోసియేషన్ విశ్వాసాన్ని చాటటంతో పాటు అసోసియేషన్ కార్యక్రమాలు మరింత విస్తరించేందుకు పలు సూచన లు సభ్యులు పరిశీలించి ఆమోదించారు, వీటిని వెంటనే అమలు చేసేందుకు నిర్ణయం తీసుకొన్నారు. కార్యక్రమంలో దార విజయ్‌కు మార్, రావూరి సత్యజ్యోతి, కన్వీనర్, వసీమల్ల విజయ్‌కుమార్, కోశాధి కారి గొర్రెముచ్చు రాజు, సందెపోగు లక్ష్మణ్‌బాబు తదితరులున్నారు.

దుల్హాన్ పథకాన్ని పునరుద్ధరించడంపై హర్షం

గుంటూరు(తూర్పు), జూలై 11: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దుల్హాన్ పథకాన్ని పునరుద్ధించడంపై మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్యాయంలో మైనార్టీ, వెల్ఫేర్ ఇన్‌చార్జీ షేక్ రోషన్ సమీర్ బాషాను టీడీపీ మైనార్టీ జనరల్ కార్యదర్శి షేక్ లాల్ వజీర్ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు అభినందించారు. దుల్హాన్ పథకాన్ని చంద్రన్న పెళ్లి కానుకగా మార్పు చేస్తూ జీవో జారీ చేయడంపై అనం దాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మైనార్టీలకు రావాల్సిన పథ కాల సమచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని సమీర్ బాషాను మైనార్టీ నాయకులు కోరారు. కార్యక్రమంలో రషీద్, అదంషఫీ, నిషా బేగం, నసీం తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు.. డ్రైనేజీ పాలు



స్థానిక బీటీసీ రోడ్డులోని టుబాకో బోర్డు కల్యాణ మండపం సమీపంలో రెండు రోజులుగా తాగునీరు వృధా అవుతోంది. ఇక్కడ పైపులైను మరమ్మతుల కోసం గుంత తవ్వి పైపునకు మరమ్మతులు చేయకపోవడంతో తాగునీరు ఇలా వృధా అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - గుంటూరు(విద్య)

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11213 99854 11225 | 99854 01877 99854 04047 99854 01614

అందుబాటు ధరల్లో బియ్యం, కందిపప్పు అందిస్తాం

● పశ్చిమ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్



రైతుబజార్లో బియ్యం, కందిపప్పు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): సామాన్యులకు అందుబాటు ధరల్లో బియ్యం, కందిపప్పు, నిత్యావసర సరుకులు అందిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు రైతుబజార్లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సంస్థాగత రిటైల్ దుకాణాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులో కందిపప్పు, బియ్యం ధరలు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పౌరసరఫరాలశాఖ ద్వారా మిల్లర్ల నుంచి హోల్ సేల్‌గా ప్రాసెస్ చేసి అందిస్తున్నారని తెలిపారు. బహిరంగ మార్కెట్లో కేజీ కందిపప్పు ధర రూ.180 నుంచి 200లుగా ఉంటే, ఈ షాపుల ద్వారా రూ.160లకే అందజేస్తున్నామన్నారు. బహిరంగ మార్కెట్లో కేజీ బియ్యం ధర రూ.55 నుంచి 60గా ఉంటే ఈ షాప్ ద్వారా కేజీ రూ.48లకే అందిస్తున్నామన్నారు. గుంటూరు నగరంలో 17 షాపుల ద్వారా కందిపప్పు బియ్యం తక్కువ ధరకు అందిస్తున్నారని సామాన్యులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అందిస్తున్న చిరుకానుక అని నసీర్ అన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి, 4వ డివిజన్ అధ్యక్షుడు రబ్బాని, కొనకళ్ల సత్యం, కుద్దూస్ వేల్పూరు కిరణ్, అల్లం బాజీ, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ పాల్ డ్రైన్ రైల్వే క్రాసింగ్‌కు చర్యలు తీసుకోవాలి

● అధికారులకు ఎమ్మెల్యే నసీర్ ఆదేశాలు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 11: సుదీర్ఘకాలం నుంచి పరిష్కా రం కాకుండా ఉన్న మొండిగేటు వద్ద అవుట్ ఫాల్ డ్రైన్ రైల్వే క్రాసింగ్‌కు వేగంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం స్థానిక పాత గుంటూరు దగ్గరలోని మొండిగేటు రైల్వేట్రాక్ వద్ద అవుట్ ఫాల్ డ్రైన్ క్రాసింగ్ అంశంపై జీఎంసీ ఇంజనీరింగ్, రైల్వే డివిజనల్ ఇంజనీర్లతో ఎమ్మెల్యే సంయుక్త సమావేశం ఏర్పాటు చేశా రు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పాత గుంటూరు పరిధిలోని మొండిగేటు వద్ద అవుట్ ఫాల్ డ్రైన్ రైల్వే ట్రాక్ క్రాస్ వద్ద షుమారు 30 ఏళ్ల నుంచి సమస్యగా ఉందని, నగరంలో నుంచి 4 మీటర్ల అవుట్ ఫాల్ డ్రైన్ నుంచి వచ్చే మురుగు లేదా వర్షం నీరు ట్రాక్ కింద కేవలం 1.5మీ మాత్రమే ఉన్న వెంట్ నుంచి వెళ్లడం వల్ల నీరు పూర్తి స్థాయిలో బెయిల్ అవుట్ కాక పాత గుంటూరులోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. సమావేశానికి హాజరైన డివిజనల్ ఇంజినీర్ తమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీవ్రతను వివరించాలన్నారు. నగరపాలక సంస్థ నుంచి కూడా రైల్వే అధికారులు తగిన వివరాలతో లేఖలు రాయాలని, కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్ర శేఖర్ దృష్టికి కూడా తీసుకెళ్లతామని తెలిపారు. తదుపరి సమావేశం నాటికి సమస్య పరిష్కారానికి నిర్దిష్ట ప్రతిపాదనలు, టైం లైన్ కార్యాచరణ సిద్ధమయ్యేలా రైల్వే, జీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జీఎంసీ ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈ కోటేశ్వరరావు, రైల్వే డివిజినల్ ఇంజినీర్ సుదర్శనరెడ్డి, డీఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

నెల రోజుల చంద్రబాబు పరిపాలన అదుర్స్ : మన్నవ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): నెలరోజుల చంద్రబాబు నాలుగో దఫా పరిపాలన అదిరిపోయిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచకం మూలంగా పారిశ్రామికవేత్తలు పారిపో యారని, కొత్త పరిశ్రమలు రాకపోగా, ఉన్న పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయని, అలాంటి దశలో ముఖ్యమంత్రిగా చం ద్రబాబు తన అద్భుత ప్రతిభతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారని అన్నారు. చంద్రన్న ప్రభుత్వం మొదటి నెలలోనే పలు కీలక నిర్ణ యాలు, సంక్షేమ పథకాల అమలుతో సరికొత్త అధ్యయానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన హామీ మేరకు వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాలు కల్పన కోసం ఇప్పటికే చంద్రబాబు పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశాలు నిర్వహి స్తూ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షిస్తున్నారని అన్నారు. నెల రోజుల పరిపాలన పూర్తి చేసుకున్న చంద్రబాబు.. నూటికి నూరు మార్కులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఐటీ రంగానికి పూర్వ వైభవం

● మంత్రి లోకేశ్‌తో పాటిబండ్ల విష్ణువర్ధన్



మంత్రి లోకేశ్‌ను కలిసి పుస్తకం అందజేస్తున్న పాటిబండ్ల విష్ణువర్ధన్ తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 11: రాష్ట్రంలో ఐటీ రంగానికి రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ద్వారా పూర్వ వైభవం వచ్చిందని ఉమ్మడి గుంటూరు జిల్లా తెలుగు యువత మాజీ అధ్య క్షుడు పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. గురువారం నారా లోకేశ్‌ని కలిసి పుస్తకాన్ని అందజేశారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ గడిచిన 5 ఏళ్లుగా ఉద్యోగాలు లేక యువత నిర్వీర్యం అయిపోయారని తెలిపారు. లోకేశ్ రాకతో విద్యార్థుల్లో, నిరుద్యోగుల్లో ఉద్యోగ అవకాశాల ఆశలు చిగురిస్తున్నాయన్నారు. అమరావతి రాజధానిగా విదేశీ పెట్టుబడులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ద్వారా భారీగా వస్తున్నాయని, అందుకు ప్రధాన కారణం చంద్రబాబుపై నమ్మకం అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పాటిబండ్ల శ్రీనివాసరావు, పావులూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

Union Bank కొత్తపేట బ్రాంచి, ఫోన్: 0863-2263445
సవరణ
యన్‌పిఏ అకౌంట్ : శ్రీ తన్నీరు వెంకటేశ్వరరావు.
ఈ-వేలము తేది : 26-07-2024.
SARFAESI చట్టం ప్రకారం ఆస్తుల విక్రయం కోసం ది.21-06-2024న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన ప్రకటనలో ఈ-వేలము విక్రయ ప్లాట్‌ఫారమ్ (ibapi.in) నుండి IBAPI MSTC e-Bikray portal (https://ebkray.in) కు మార్చబడినది తెలియజేయడమైనది. ... https://ebkray.in సందర్శించండి. మిగిలిన నియమనిబంధనలలో ఎటువంటి మార్పులేదు.
స్థలం : గుంటూరు, తేది : 11-07-2024



దిక్సూచి DIKSUCHI

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/ పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోం సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే ఒకటోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత



ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు - 522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఇగ్నోలో ఓడీఎల్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సులు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అడ్వాన్స్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, పవర్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అప్రిసియేషన్ కోర్సు: కోర్సు వ్యవధి మూడు నెలలు.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్, క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్, డెయిరీ టెక్నాలజీ, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఫ్యాషన్ డిజైన్ అండ్ రిటైల్, హార్టికల్చర్, మీట్ టెక్నాలజీ, మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్, న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, పారాలీగల్ ప్రాక్టీస్, థియేటర్ ఆర్ట్స్, టూరిజం స్టడీస్, ఉర్దూ, వాల్యూ ఎడ్యుకేషన్, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, ఉమన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, అగ్రికల్చరల్ అండ్ కాస్ట్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మర్చండైజింగ్, రిటైలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీఏ, బీఏ ఆనర్స్, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్ బీకాం, బీఎస్‌డబ్ల్యూ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ వ్యవధి ఏడాది.

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంటీటీఎం, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంఎల్ఐఎస్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అనలిటికల్ కెమిస్ట్రీ, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, గాంధీ అండ్ పీస్ స్టడీస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, యానిమల్ వెల్ఫేర్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఆడియో ప్రోగ్రామ్ ప్రొడక్షన్, బుక్ పబ్లిషింగ్, కార్పొరేట్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, డెవలప్‌మెంట్ స్టడీస్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ తదితర స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. అగ్రికల్చర్ పాలసీ, క్లయిమేట్ చేంజ్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఇన్వెంటరీ ప్లానింగ్ అండ్ వేర్ హౌసింగ్ సిస్టమ్ ఫర్ ఇంజనీర్స్, మలయాళం-హిందీ ట్రాన్స్‌లేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** ignouadmission.samarth.edu.in

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమాలు

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. మహిళలకు ప్రోగ్రామ్ ఫీజులో పది శాతం రాయితీ లభిస్తుంది. పవర్ సంస్థలు స్పాన్సర్ చేసే అభ్యర్థుల కోసం 25 శాతం సీట్లు కేటాయించారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించి కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ డిప్లొమా ఇన్ పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి ఏడాది. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, దుర్గాపూర్, అలప్పుజా, శివ్‌పురి సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఒక్కో సెంటర్లో 60 సీట్లు చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ హైడ్రో పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి తొమ్మిది నెలలు. నంగల్ సెంటర్లో ఈ ప్రోగ్రామ్ ఉంది. ఇక్కడ 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: కోర్సు వ్యవధి ఏడాది. న్యూఢిల్లీ, శివ్‌పురి, నైవేలీ, అలప్పుజా సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో (బీఈ/బీటెక్)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ కోర్సుకు ఏ ఇంజనీరింగ్ విభాగంవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **టెలిఫోనిక్ ఇంటర్వ్యూ:** జూలై 30, 31
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఆగస్టు 2
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 5, 6
- **కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.npti.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/V9yZi4uలో చదవండి.

సెప్టెంబర్ ఒకటిన బాలకృష్ణకు భారీ సన్మానం



'తాతమ్మ కల' (1974) చిత్రంతో తన నట జీవితాన్ని ప్రారంభించారు నందమూరి బాలకృష్ణ. వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ 50 ఏళ్లుగా హీరోగా కొనసాగుతున్న ఏకైక కళాకారుడు ప్రపంచంలో ఆయన ఒక్కరే అంటే అది అతిశయోక్తి కాదు. అంతేకాదు తండ్రి, మహానటుడు ఎన్టీఆర్ మార్గాన్ని అనుసరించి రాజకీయాల్లోకి ప్రవేశించి హిందూపురం నియోజక వర్గం నుంచి మూడు సార్లు వరుసగా శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఇలా సినీరంగంలోనూ, రాజకీయ రంగంలోనూ సత్తా చాటుతూ 50 ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్న బాలకృష్ణను తెలుగు చిత్రపరిశ్రమ సెప్టెంబర్ ఒకటిన ఘనంగా సత్కరించనుంది. ఈ మేరకు తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కలవగా, బాలకృష్ణ ఈ సన్మానానికి తన అంగీకారం తెలిపారు. బాలీవుడ్, ఇతర సినీ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ సన్మాన సభకు హాజరవుతారని సమాచారం.

షూటింగ్ మొదలుపెట్టారు



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న తాజా చిత్రం రెగ్యులర్ షూటింగ్ గురువారం మొదలైంది. వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఓ పోలీస్ ఆఫీసర్, ఆయన భార్య, మాజీ ప్రేయసి.. ఇలా మూడు పాత్రల చుట్టూ తిరిగే వినోద భరిత చిత్రమిదని, ఇందులో క్రైమ్ ఎలిమెంట్ కూడా మిళితమై ఉంటుందని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పారు. ప్రస్తుతం ప్రారంభమైన షూటింగ్‌లో చిత్రంలోని ముఖ్య తారాగణమంతా పాల్గొంటోంది. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత శిరీష్ చెప్పారు. దిల్ రాజు ఈ సినిమాకు సమర్పకుడు. ఈ చిత్రానికి సమీర్‌రెడ్డి ఛాయాగ్రాహకుడు, భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడు.

ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్ ఉత్తమ నటిగా సాయి పల్లవి

ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డుల సందడి





జాతీయ చలనచిత్ర అవార్డుల తర్వాత భారతీయ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డులను గురువారం ప్రకటించారు. అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు పొందిన 'ఆర్ ఆర్ ఆర్' చిత్రం తెలుగు విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్, ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి ఎన్నికయ్యారు. 'విరాటపర్వం' చిత్రంలో నటించిన సాయిపల్లవి ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. 'భీమ్లా నాయక్'లో నటించిన రానా ఉత్తమ సహాయ నటుడిగా, 'విరాటపర్వం'లో నటించిన నందితా దాస్, 'సీతారామం'లో నటించిన మృణాల్ ఠాకూర్ ఉత్తమ సహాయ నటీమణులుగా, ఉత్తమ గేయ రచయితగా సీతారామశాస్త్రి (సీతారామం) ఎన్నికయ్యారు. తమిళంలో ఉత్తమ నటుడిగా కమల్ హాసన్ (విక్రమ్) ఉత్తమ నటిగా ఊర్వశి, ఉత్తమ చిత్రంగా 'పొన్నియిన్ సెల్వం 1', ఆ సినిమాకు దర్శకత్వం వహించిన మణిరత్నం ఉత్తమ దర్శకుడిగా ఎన్నికయ్యారు. కన్నడంలో 'కాంతార', మలయాళంలో 'న్నా థాన్ కేసు కుడు' ఉత్తమ చిత్రాలుగా ఎన్నికయ్యాయి.

వినోదాత్మకంగా డార్లింగ్



అశ్విన్‌రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డార్లింగ్'. ప్రియదర్శి, నభానటేశ్ జంటగా నటించగా, కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశ్విన్‌రామ్ మీడియాతో ముచ్చటించారు. "కొత్త జంట పెళ్లిని ఎలా హ్యాండిల్ చేస్తారనేది ఇందులో వినోదాత్మకంగా చూపించా. సినిమాల ద్వారా సందేశాలు ఇవ్వడం నాకు ఇష్టం ఉండదు. ఈ సినిమాలో ఎంటర్టైన్‌మెంట్‌తో పాటూ ఓ సామాజిక బాధ్యతను కూడా జత చేశా. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. అలా ఆ పాత్రలకి సరిపోయే నటీనటులను పరిశీలించాక.. ప్రియదర్శి, నభానటేశ్ వందశాతం సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. నభా పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి.. సినిమాలో నభా మీ అందరినీ పూర్తిగా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు.

అద్భుతమైన విజువల్స్‌తో..



వరుణ్ సందేశ్ నటిస్తున్న చిత్రం 'విరాజీ'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్‌ను దర్శకుడు సాయి రాజేశ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్‌లో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. వరుణ్ లుక్ అదిరిపోయింది" అని చెప్పారు. "ఈ చిత్రం నాకు చాలా స్పెషల్" అని వరుణ్ సందేశ్ అన్నారు. "ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. వాటిని థియేటర్లలో చూసి ఆశ్చర్యపోతారు" అని దర్శకుడు ఆద్యంత్ హర్ష తెలిపారు.

ముందు రిసెప్షన్.. తర్వాత పెళ్లి!



వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ మంచి నటిగా తెలుగువారికి దగ్గరైన తమిళ నటి వరలక్ష్మి తన పెళ్లి వేడుకలోనూ వైవిధ్యం చూపించారు. వారం రోజుల క్రితం చెన్నైలో వరలక్ష్మి, నికోలై సచిదేవ్‌ల పెళ్లి రిసెప్షన్ చెన్నైలో జరిగింది. ఈ వేడుకకు పలువురు చిత్ర ప్రముఖులు హాజరయ్యారు. ఇలా అందరి అభినందనలు అందుకున్న వరలక్ష్మి, నికోలై సచిదేవ్ మంగళవారం థాయ్‌లాండ్‌లోని క్రాబి బీచ్ రిసార్ట్‌లో పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, అతికొద్దిమంది సన్నిహితుల మధ్య తమిళ సంప్రదాయానికి అనుగుణంగా ఈ పెళ్లి జరిగింది.

అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సంచలనం



సత్యం రాజేశ్, బాలాదిత్య, గెటప్ శ్రీను ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'పొలిమేర 2' బాక్సాఫీస్ వద్ద ఊహించని సక్సెస్‌ను అందుకుని హారర్ థ్రిల్లర్ జానర్ సినిమాల్లో సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 2021లో 'మా ఊరి పొలిమేర' చిత్రం ఓటీటీ సంస్థ 'డిస్నీ ప్లస్ హాట్‌స్టార్'లో విడుదలై అందరినీ మెప్పించింది .'మా ఊరి పొలిమేర'కు సీక్వెల్‌గా వచ్చిందే 'పొలిమేర 2'. గతేడాది నవంబరులో విడుదలైన ఈ సక్సెస్‌ఫుల్ హారర్ థ్రిల్లర్ ఫిల్మ్‌కు కొనసాగింపుగా ఇంకో భాగం ఉంటుందని మేకర్స్ అప్పుడే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించారు. తాజాగా, 'పొలిమేర 3'ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో సంచలనం సృష్టిస్తోంది. ఈ వీడియో రిలీజైన కొద్దిసేపటికే ఎక్స్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ టాప్ ప్లేస్‌ను ఆక్రమించింది. మూడో భాగాన్ని మొదటి రెండు పార్టులకు దర్శకత్వం వహించిన అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించనున్నారు. భోగేంద్ర గుప్తా, వంశీ నందిపాటి సంయుక్తంగా నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నట్లు మేకర్స్ వెల్లడించారు. 'పొలిమేర 3' లో సత్యం రాజేష్, బాలాదిత్య కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, చిత్రం శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్నారు.







ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292



డ్రెయిన్‌లలో సిల్ట్‌ను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

డ్రెయిన్‌లలో సిల్ట్ తొలగింపు

తెనాలి, మారీసుపేట జూలై 11: పట్టణంలో డ్రెయిన్‌లోని సిల్ట్‌ను తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ సిబ్బంది కొనసాగిస్తున్నారు. స్థానిక ముత్తెంశెట్టిపాలెం పట్టావారి వీధిలో గురువారం మున్సిపల్ అధికారులు డ్రెయిన్‌లలోని సిల్ట్‌ను తొలగించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కమిషనర్ బి శేషన్న ఆదేశాలతో డ్రెయిన్‌లలోని సిల్ట్‌ను, వ్యర్థాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను, డ్రెయిన్‌లపై ఆక్రమణలను తొలగించామన్నారు. ప్రజలు చెత్తను కాల్వలో వేయరాదని రెండు బుట్టల విధానాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

● యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బీబీజాన్

తెనాలి, మారీసుపేట జూలై 11: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బీబీజాన్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో గురువారం సీజనల్ వ్యాధులైన డయేరియా, డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బీబీజాన్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో డయేరియా ప్రబలే ప్రమాదం ఉన్నదన్నారు. డయేరియా బారిన పడిన వారు దగ్గరలోని హెల్త్ సెంటర్‌లో, ఆరోగ్య కార్యకర్తలను ఆశా కార్యకర్తలను సంప్రదించి తగు వైద్య పరీక్షలను, ఉచిత వైద్యసాయం పొందవచ్చన్నారు. వయోవృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్తులకు టీబీ రాకుండా బీసీజీ టీకా మందును తీసుకోవాలన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌లలో బీసీజీ టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ మున్సిపల్ కార్యాలయంలో...

తెనాలి, మారీసుపేట జూలై 11: పట్టణ పురపాలక సంఘ ఆవరణలోని మెప్మా కార్యాలయంలో గురువారం అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ కారుమూరు హెలెన్ నిర్మల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవగాహనతోనే చిన్న పిల్లలో వచ్చే అతిసార వ్యాధిని నియంత్రించడం సాధ్యమన్నారు. కలుషిత నీరు, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోరాదని అన్నారు. అతిసార వ్యాధి వచ్చిన వెంటనే దగ్గరలో ఉన్న హెల్త్ సెంటర్లకు వెళ్లి చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మేనేజర్ వి మాధవరావు, ఆరోగ్య విస్తరణాధికారి బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్ విజయకుమారి, ఏఎన్ఎం సౌజన్య డ్వాక్రా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన నక్షత్ర శాంతి హోమ పూజలు

తెనాలి, మారీసుపేట జూలై 11: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం నందు సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) పర్యవేక్షణలో నవగ్రహ సహిత పునర్వసు నక్షత్ర సంపూర్ణ శాంతి హోమ పూజలు పూర్ణాహుతి కార్యక్రమాలతో ముగిశాయి. గురువారం అన్ని నక్షత్రాల వారిచే గణపతి పూజ, గణపతి హోమం, రుద్రాభిషేకాలు, నవగ్రహ, శ్రీమహామృత్యుంజయ హోమాలను పూజలను నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు గుంటూరు, కృష్ణా జిల్లాల అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసు, వాసవీ నిత్యాన్నసత్ర వాన ప్రస్థాశ్రమ సేవా సమితి సభ్యులు, ట్రస్ట్ ఛైర్మన్ నంబూరు వెంకటకృష్ణమూర్తి, గోపు రామకృష్ణ, కోనా నాగేశ్వరరావు, సుబ్బారావు, వెంకటేశ్వరావు, జయలక్ష్మి మాతృ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

కార్మికులకు అండగా నిలిచిన ఈయూ

● డిపో చీఫ్ అడ్వైజర్ సాంబశివరావు

తెనాలి రూరల్, జూలై 11: కార్మికులకు ఎదురైన అనేక సమస్యలపై పోరాటం చేసి వారికి అండగా నిలిచింది ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ యూనియన్ అని సీనియర్ నాయకులు డిపో చీఫ్ అడ్వైజర్ బి. సాంబశివరావు అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత యూనియన్ నాయకులు సాంబశివరావు జెండా ఆవిష్కరించి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులందరూ ఐకమత్యంగా ఉంటూ కార్మిక సంక్షేమానికి యూనియన్‌ను మరింతగా బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. జోనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ పి.ఎల్లమందయ్య, జిల్లా సెక్రటరీ ఇ.విజయ్‌కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.రాజేష్ కన్నా, డిపో గౌరవాధ్యక్షుడు పీ.వీరయ్యబాబు, ఆర్.ముక్తేశ్వరరావు, ఏవీ కృష్ణారెడ్డి, వైఎస్ఎస్ రావు, వి.ఈశ్వరరావు, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు డీడీఎస్ రావు, వి.జోషిబాబు, మహిళా నాయకులు జి.పోలేరమ్మ, డీఎల్‌పీ దేవి, భూలక్ష్మి, ప్రసన్న, ఫాతిమా, జ్యోతి, కె.కమలకుమారి, టీవీ.లక్ష్మి, గ్యారేజ్ నాయకులు ఎస్కే రబ్బాని, రాఘవయ్య, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో విజయమ్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్న డాక్టర్ జీవనలత

డాక్టర్ జీవనలతకు ఉత్తమ ట్యూబెక్టమీ సర్జన్ అవార్డు

తెనాలి రూరల్, జూలై 11: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ జీవనలతకు ఉత్తమ ట్యూబెక్టమీ సర్జన్ అవార్డు అందుకున్నారు. బాపట్ల జిల్లా కనగాలలో డాక్టర్‌గా పలువురు స్త్రీలకు ట్యూబెక్టమీ సర్జరీ ద్వారా ఆమెచేసిన శస్త్రచికిత్సలకు గాను ఈ అవార్డు దక్కింది. బాపట్ల డీఎంహెచ్‌వో డాక్టర్ డి.విజయమ్మ గురువారం డాక్టర్ జీవనలతను అభినందించి ఆమెకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు డాక్టర్ జీవనలతకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల



భాస్కర సినిమాస్	-	గుంటూరు
లక్ష్మీ కాంప్లెక్స్	-	తెనాలి
కృష్ణ	-	ఒంగోలు
రవి కళా మందిర్	-	నరసరావుపేట
కెఆర్‌కాంప్లెక్స్	-	చిలకలూరిపేట
శాంతి	-	చీరాల
బసవేశ్వర	-	రేపల్లె
కళామందిర్	-	అద్దంకి
సుబ్బరాయ	-	పొన్నూరు
శ్రీనివాస	-	సత్తెనపల్లి
విజయ	-	మంగళగిరి
నాగార్జున క.మం.	-	మాచర్ల

SUCHIN CINEMAS

పసుపు రైతులకు నష్టపరిహారం అందజేస్తాం

సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతులు

తెనాలి అర్బన్, జూలై 11: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు పరిహారం ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ చెప్పారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలిసిన రైతులకు ఈ విషయం తెలిపారు. క్వింటాకు రూ.7 వేలు పరిహారం అందివ్వనుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ సంఘటన విషయంలో రైతులకు న్యాయం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం ముందుకు రావడంపై రైతులు ఆనందం వ్యక్తంచేశారు. అయితే క్వింటాకు రూ.10వేలు వస్తుందని ఆశపడ్డామని, కానీ రూ.7 వేలకు మించి ఇవ్వలేమని ప్రభుత్వం, మంత్రి స్పష్టం చేయడంతో అయిష్టంగానే అంగీకరించామని రైతు సంఘ నేత ములకా శివసాంబిరెడ్డి చెప్పారు. వేములపల్లి వెంకట్రామయ్య, చందు సత్యనారాయణ, నాగవీరబసవయ్య, చంద్రశేఖరరావు, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

టెలిగ్రామ్ యాప్‌లో టాస్క్ అంటూ మోసం

తెనాలి రూరల్, జూలై 11: టెలిగ్రామ్ యాప్‌లో మీకో టాస్క్ ఇస్తామని గెలిస్తే ప్రైజ్ కింద నగదు చెల్లిస్తామని వచ్చిన లింక్‌ను క్లిక్‌చేసి బ్యాంక్ ఖాతాలో దాదాపుగా రూ.2.50వేలు పోగొట్టుకున్న ఘనటపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు చెప్పారు. మండలంలోని కొలెవరం గ్రామానికి చెందిన తుమ్మల రేణుక తన టెలిగ్రామ్‌కు ఓ అజ్ఞాత వ్యక్తి టాస్క్ అంటూ లింకు పంపారు. దీంతో ఆ టాస్క్‌ను ఆడేందుకు లింక్ ఓపెన్ చేసింది. వారు చెప్పినట్లు టాస్క్‌లో విజయం సాధించింది. దీంతో సుమారుగా రూ. 30వేలు గెలుపొందినట్లు చెప్పారు. ఆ సొమ్మును బ్యాంక్ ఖాతాకు జమచేస్తానని బాధితురాలిని నమ్మబలికి అకౌంట్ వివరాలు రాబట్టారు. దీంతో ఆ సొమ్మును మరుసటి రోజు ఆమె అకౌంటుకు జమచేశారు. దీంతో వారిని నమ్మిన బాధితురాలు మరోసారి వారు పంపిన లింక్‌ను క్లిక్ చేసింది. కొంత సేపటికి ఆమె ఖాతాల్లో ఉన్న సుమారు రూ.2.50వేలు ఖాళీ అయ్యాయి. దీంతో బాధితురాలు సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోయినట్లు గ్రహించి రూరల్ పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

భూమి విషయంలో చీటింగ్ చేశారని కేసు నమోదు

తెనాలి రూరల్, జూలై 11: భూమి అమ్మకం విషయంలో నగదు తీసుకుని చీటింగ్ చేశాడని అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని అంగలకుదురు గ్రామానికి చెందిన సుమలత అదే గ్రామానికి చెందిన లతామాధవరావుకు భూమి విషయంలో రూ.8లక్షలు ఇచ్చారు. అయితే అతడు తనకు డబ్బులు ఇవ్వలేదని చెబుతూ మోసం చేశాడని బాధితురాలి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చెత్తరహిత గ్రామాల కోసం పాటుపడదాం

డీపీవో శ్రీదేవి

పొన్నూరు టౌన్, జూలై 11: గ్రామాలను చెత్తరహితంగా మార్చేందుకు పాటుపడదామని జిల్లా పంచాయతీల అధికారి కుసుమ శ్రీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని మునిపల్లె, పచ్చలతాడిపర్రు, దొప్పలపూడి, చింతలపూడి, ములుకుదురు గ్రామాలోని ఘన వ్యర్థ పదార్థాల నుంచి సంపద తయారీ కేంద్రాలను డీపీవో శ్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ అందుబాటులలో ఉన్నప్పటికి నిర్వహణ మాత్రం ప్రారంభించకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలు ప్రాథమిక బాధ్యతగా వీధి దీపాలు, తాగునీరు వంటి సౌకర్యాలను ఈ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నాడెప్ తొట్టిలో వాన పాములను వినియోగించి వర్మీ కంపోస్ట్ తయారీపై దృష్టి సారించాలని సూచించారు. సెగ్రిగేషన్ ప్లాట్ ఫామ్‌ను అందుబాటులోనే ఉన్నందున చెత్తశుద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. గ్రామాల్లో చెత్త కుప్పలు కనిపించకూడదని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం అయినందున పంచాయతీ కార్యదర్శులు బ్లీచింగ్, సున్నం అందుబాటులో ఉంచుకుని పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నిత్యం ఫాగింగ్ చేయాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో పారిశుధ్య సమస్యను, మురుగుకాల్వల సిల్ట్ తొలగింపు వంటి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. సంపద సృష్టి కేంద్రాల వద్ద బయోఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో స్వరూపరాణి, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, గ్రామ కార్యదర్శి కె శ్రీను, రిసోర్స్ పర్సన్స్ అనూరాధ, నిరంజన్ పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్న డీపీవో శ్రీదేవి

విద్యావ్యవస్థకు తీరని మచ్చలా వైసీపీ తీరు

● టీడీపీ నాయకుడు వీరవల్లి మురళి

తెనాలి రూరల్, జూలై 11: జగన్‌మోహన్‌రెడ్డి పాలన విద్యావ్యవస్థకు కూడా తీరని మచ్చలా ఉందని గణేష్‌యూత్ కన్వీనర్ టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. జగన్ రాష్ట్రాభివృద్ధిని తుంగలో తొక్కి ఇసుక, మట్టి ఇలా ప్రకృతి సంపద నంతా దోచేసి, అక్రమ మద్యంతో వేల కోట్లు వెనకేసుకున్నాడన్నారు. ఇక విశ్వవిద్యాలయాల్లో సైతం అడ్డగోలుగా అర్హతలేని వారికి పోస్టులు కల్పించారని ఆరోపించారు. ఆ పార్టీ నాయకురాలు లక్ష్మీపార్వతికి ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)లో మాజీ వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి తెలుగు ప్రొఫెసర్‌గా నియమించి అడ్డగోలుగా ప్రజల సొమ్మును దోచిపెట్టిన తీరుపై వీరవల్లి మురళి ఆగ్రహం వ్యక్తం చేశాడు. యూనివర్సిటీలో జరిగిన అవకతవకలపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవకతవకలు జరిగిన సొమ్మును రికవరీ చేయాలని ఇందులో కూటమి ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మురళి డిమాండ్ చేశారు.



కెప్టెన్ ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులు

కెప్టెన్ విజయప్రసాద్‌కు ఘన నివాళి

తెనాలి అర్బన్, జూలై 11: కెప్టెన్ యర్రంనేని విజయప్రసాద్ 36వ వర్ధంతి చెంచుపేట శబరి వృద్ధాశ్రమంలో నిర్వహించారు. గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, దేశ సేవలో విజయప్రసాద్ సేవలు అందించారని చెప్పారు. తమిళ ఈలం టైగర్ ప్రభాకరన్‌తో జరిగిన పోరులో వీరమరణం పొందారని ఆయన త్యాగం ఎనలేనిదని చెప్పారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎల్ నారాయణ, ఆనందరావు, మురహరిరావు, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచిన క్రీడాకారుల జట్టు

రీజనల్ వాలీబాల్ పోటీల్లో

కేంద్రీయ విద్యాలయం జట్టుకు ప్రథమ స్థానం

తెనాలి అర్బన్, జూలై 11: రీజనల్ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో తెనాలి కేంద్రీయ విద్యాలయం జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ నెల 8, 9 తేదీల్లో సత్తెనపల్లిలో అండర్-16 వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన జట్టు జాతీయ క్రీడలకు అర్హత సాధించిందని ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ తెలిపారు. విజయం సాధించిన జట్టు క్రీడాకారులకు గురువారం పాఠశాలలో మెడల్స్, మెమొంటో అందించి అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుడిశా బసివిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రామ పెద్దలు, నాయకులు

చినబసివిరెడ్డి సేవలు మరువలేనివి

● గ్రామాభివృద్ధి కమిటీ నాయకుడు శివకోటిరెడ్డి

కొల్లిపర, జూలై 11: మండల పరిధిలోని తూములూరులో మండల పరిషత్ ప్రథమ అధ్యక్షుడు గుడిశా చినబసివిరెడ్డి 26వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. బసివిరెడ్డి విగ్రహానికి గ్రామ పెద్దలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ నాయకుడు ఈమని శివకోటిరెడ్డి మాట్లాడుతూ బసివిరెడ్డి మండల పరిషత్ అధ్యక్షుడుగా, తూములూరు గ్రామానికి సర్పంచ్‌గా, తెనాలి మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడిగా పనిచేసి అందరి మన్ననలను పొందినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మండల అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. బసివిరెడ్డి సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అవుతు బసవపున్నారెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ వింతా మోహన్‌రెడ్డి, గ్రామ పెద్దలు వింతా రాఘవరెడ్డి, అడపా నారాయణరెడ్డి, గుడిశా సుబ్బారెడ్డి, ఆరుమళ్ళ శివారెడ్డి, కొల్లి రాఘవరెడ్డి, చాగంటి రాఘవరెడ్డి, బేతాళ భూషణం, బద్దిగం శ్రీనివాసరెడ్డి, ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవతా సంస్థ పట్టణాధ్యక్షుడు ప్రసాద్‌కు సత్కారం

తెనాలి, మారీసుపేట జూలై 11: తెనాలి ఏరియా మానవతా సంస్థ నూతన అధ్యక్షుడు కటకం వెంకట ప్రసాద్‌ను ఏపీ ఉద్యోగ సంఘ దుగ్గిరాల సభ్యులు ఘనంగా సత్కరించారు. స్థానిక గాంధీచౌక్‌లోని మహాత్మా గాంధీ కాంప్లెక్స్‌లో గురువారం మానవతా సంస్థ తెనాలి ఏరియా పట్టణాధ్యక్షుడుగా నియమితుడైన కటకం వెంకట ప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళి పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెనాలి కార్యవర్గ సభ్యులు జి.రవికుమార్, డి.శ్రీనివాసరావు, టి.శివరామప్రసాద్, బాషిద్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ పావని ప్రియాంక

వ్యాధులపై మహిళలకు అవగాహన సదస్సు

తెనాలి అర్బన్, జూలై 11: మహిళల్లో వచ్చే వివిధ సమస్యలపై డాక్టర్ పావని ప్రియాంక అవగాహన సదస్సు నిర్వహించారు. కొత్తపేటలోని హ్యాపీ హాస్పటల్‌లో గురువారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ, మంచి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనారోగ్య సమస్యలు ముందుగానే గుర్తించి వైద్యులను సంప్రదించాలని తద్వారా తీవ్ర పరిస్థితుల నుంచి బయట పడాలన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లీలారాణి, విజయలక్ష్మి, అనూరాధ, పద్మావతి, కళ్యాణి, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల్లోనే మెరుగైన విద్యాబోధన

● గొడవర్రు సర్పంచ్ జానకీదేవి

చేబ్రోలు, జూలై 11: ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన విద్యాబోధన అందిస్తున్నట్లు గొడవర్రు సర్పంచ్ జానకీదేవి తెలిపారు. గురువారం మండల పరిధిలోని గొడవర్రులో విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికిపోతా ర్యాలీని నిర్వహించారు. సర్పంచ్ జానకీదేవి ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన, వసతుల గురించి సర్పంచ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గొడవర్రులో నేను బడికి వెళ్తా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం అందచేస్తున్న అధికారులు

పేదల సంక్షేమం కోసమే కందిపప్పు, బియ్యం పంపిణీ

పొన్నూరు టౌన్, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం తక్కువ ధరకు నాణ్యమైన కందిపప్పు, బియ్యం రైతు బజార్ల ద్వారా అందిస్తున్నట్లు ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని రైతు బజార్‌లో గురువారం తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం విక్రయాల స్టాల్‌ను తహసీల్దార్ సూర్యనారాయణసింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు కూటమి పార్టీల నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదల జీవనం ప్రమాదంలో పడిందన్నారు. సామాన్యులు, చిరుఉద్యోగులు పెరిగిన నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయలేక పౌష్టికాహారానికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, రాగులు వంటి పప్పు ధాన్యాలను రాయితీపై అందించేవారమన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ దుకాణాలను కేవలం బియ్యం సరఫరాకు మాత్రమే వినియోగించారన్నారు. ప్రజల ఇబ్బందులను గమనించి కూటమి ప్రభుత్వం సరసమైన ధరల్లో నాణ్యమైన సరుకులు అమ్మకం ప్రక్రియను ప్రారంభించినట్లు చెప్పారు. అందులో భాగంగా బహిరంగ మార్కెట్‌లో రూ.181 ఉన్న దేశవాళీ కందిపప్పు రూ.160కే అందిస్తున్నట్లు చెప్పారు. రూ.55 వరకు ఉన్న సన్న బియ్యంను రూ.49కే ఈ రైతు బజార్ విక్రయాల స్టాల్ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు బండ్లమూడి బాబురావు, ఆకుల సాంబశివరావు, యన్నం నాయుడు, షేక్ కరిముల్లా, జి.కృష్ణరావు, సూర్య, తాళ్లూరి అప్పారావు, తోట శ్రీను తదితరులతో పాటు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి యువకుడి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

తెనాలి అర్బన్, జూలై 11: ఆర్టీసీ బస్సు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. తెనాలి ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో రేపల్లె బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న ఒక యువకుడు జనం ఎక్కువగా ఉండటంతో తోపులాటలో కింద పడిపోయాడు. అతని మీదుగా వెనుక టైరు వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థుల ఎంపిక

కొల్లిపర, జూలై 11: మండల పరిధిలో మున్నంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో విద్యనభ్యసించిన ముగ్గురికి, అత్తోట కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురికి ట్రిపుల్ ఐటీలో స్థానం దక్కిందని ప్రధానోపాధ్యాయుడు పి.అప్పారావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని మున్నంగి హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ హైస్కూల్‌కు చెందిన కె.వివేక్, సిరిచైతన్య, రాగసుస్మిత, అత్తోటలో వై.లక్ష్మీపూజిత, చందు మేఘన, వై.నాగసత్యంలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైనవారిని ప్రధానోపాధ్యాయుడు అప్పారావుతో పాటు ఉపాధ్యాయులు పొత్తూరి సాంబశివరాజు, మహ్మద్‌సాబీర్, బివరప్రసాద్, లలితకుమారి, రాజేశ్వరి, అనసూయదేవి, తోటి విద్యార్థులు అభినందించారు.



ఎంప్లాయిస్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్మికుల హక్కుల పరిరక్షణకు ఈయూ పోరాటం

● ఆర్‌జీ రాజు

పొన్నూరు టౌన్, జూలై 11: ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎంప్లాయీస్ యూనియన్ నిరంతరం పోరాడుతుందని ఆ సంస్థ అధ్యక్షుడు ఆర్‌జీ రాజు అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం పట్టణంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో యూనియన్ పతాకాన్ని నాయకులు ఎస్కే వలీ ఎగురవేసి వందన సమర్పణ చేశారు. పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో వారంతపు శెలవులు పోరాడి సాధించుకున్నామన్నారు. కార్మికులు అనుభవిస్తున్న బస్‌పాస్‌లను యూనియన్ పోరాట ఫలితంతోనే సాధ్యమైందన్నారు. అలవెన్స్‌లు, యూనిఫాం వంటి సదుపాయాలు కూడా యూనియన్ పోరాటాల వల్లనే కార్మికులకు వచ్చాయన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఏఏబేగ్, ఎల్ఎన్ బాబు, ఖాసీమ్ బుడే, గ్యారేజ్ కార్యదర్శి కేఎస్ రావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఆరేటి రామారావు, ప్రజానాట్య మండలి కళాకారులు రాజేంద్ర కుమార్, దేవరకొండ శ్రీనివాసరావు, ఎస్కే రహీమ్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కూలి పనులు దొరకడం లేదని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, జూలై 11: స్థానిక అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి లోని శారదా కాలనీ 14వ లైనుకు చెందిన వేల్పుల యేసు (34) అనే కూలి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలీ పనులు సరిగా దొరకడం లేద ని మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగిన యేసు ఈ నెల 4న ఎలుకల మందు తిన్నాడు. ఆయనను వెంటనే జీజీహెచ్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స తీసుకోకుండానే వచ్చేశాడు. ఈ క్రమంలో ఈనెల 7న ఆయన పరిస్థితి విషమంగా మారడంతో వెంటనే కుటుంబసభ్యులు మరోసారి జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

స్థానిక నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్‌లో ప్యారడైజ్ టీ స్టాల్ వద్ద కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతడికి సుమారు 40-45 సంవత్సరాల వయసు ఉంటుందని, కొద్ది రోజుల నుంచి చుట్టుపక్కల అడుక్కుని తింటూ అక్కడ ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో 10న రాత్రి సుమారు 7 గంటల సమయంలో సదరు వ్యక్తిని మార్కెట్ వైపు నుంచి కలెక్టరేట్ వైపునకు వెళుతున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు తెలిసినచో గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

దశావతారునికి ఆషాఢ పట్టీ సమర్పణ

పెదకాకాని, జూలై 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతారం వెంకటేశ్వరస్వామికి ఆషాడమాసం సందర్భంగా ఆషాడం పట్టీని అందజేశారు. గురువారం బజేయం (రైన్ ట్రీ పార్క్) లింగమనేని టౌన్‌షిప్ విల్లాస్‌కు చెందిన భక్తులు ఈ పట్టీని సమర్పించారు.

యూనియన్ బ్యాంక్ Union Bank
కొత్తపేట బ్రాంచ్
డోర్ నెం.12-12-83, [illegible] రోడ్, కొత్తపేట, గుంటూరు. ఫోన్: 0863 - 2263465
సవరణ
యూనియన్ ఆకౌంట్ : శ్రీ తన్నీరు వెంకటేశ్వరరావు,
ఈ- వేలము తేది : 26-07-2024.
SARFAESI చట్టం ప్రకారం ఆస్తుల విక్రయం కోసం ది.21-06-2024న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన ప్రకటనలో ఈ- వేలము విక్రయ ప్లాట్‌ఫారమ్ (ibapi.in) నుండి IBAPI MSTC e-Bikray portal (https://ebkray.in) కు మార్చబడిందని తెలియజేయడమైనది. ఆస్తి వివరాలను చూడటానికి, బిడ్డర్‌గా నమోదు చేయడానికి మరియు లాగిన్ చేయడానికి మరియు పైన పేర్కొన్న విధంగా ఇది వరకే జారీచేయబడిన వేలం నోటీసు/లకు సంబంధించి వేలం ప్రక్రియలో పాల్గొనడానికి మరియు పైన పేర్కొన్న కారణం వలన విక్రయ నిబంధనలు మరియు షరతులను మార్చడానికి దయచేసి https://ebkray.in సంప్రదించండి. మిగిలిన నియమనిబంధనలలో ఎటువంటి మార్పులేదు.
ప్రదేశం : గుంటూరు, తేది : 11-07-2024
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొత్తపేట బ్రాంచ్, గుంటూరు.